ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఆగస్టు 06, 2017

స్నేహం.. త్యాగం.. విప్లవం..



NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell · 9849070838



ఒకప్పుడు మధ్యతరగతి కుటుంబాల్లో ఎక్కువగా కనిపించే సైకిల్ మన సినిమాల్లో నూ పాపులరే. 40-50ల మధ్యతరగతి కుటుంబ కథా చిత్రాలకి ఒక కొత్త స్టేటస్‌నిచ్చింది. తర్వాత కాలంలో మహిళా చైతన్యానికి ప్రతిబింబంగా నిలిచిపోయింది. అలా సైకిల్‌పై అమ్మాయిలు రివ్వుమంటూ తిరిగే సన్నివేశాలు, పాటలు ఫేమస్ అయిపోయాయి. 'మగమహారాజు' చిత్రంలో చిరంజీవి చేసిన ఒక ఛాలెంజింగ్ సీన్‌కి సైకిల్ ప్రధాన కథా వస్తువైతే 'శివ'లో సైకిల్ చెయిన్ సీన్ యువతని కట్టిపడేసింది. ఆ తర్వాత అడపాదడపా సినిమాల్లో సైకిల్ సన్ని వేశాలు కనిపిస్తూనే వున్నా....రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'మర్యాదరామన్న' చిత్రంలో సైకిలే ప్రధాన ఆకర్షణ. దానికి ఒక ప్రముఖ హీరో వాయిస్ మరింత పాపులారిటీని తెచ్చిపెట్టింది. 'రామయ్యా వస్తావయ్యా, 'జయమ్ము నిశ్చయమ్మురా', 'జెంటిల్‌మెన్' చిత్రాల్లో సైకిల్‌పై చిత్రీకరించిన పాటలు, సన్ని వేశాలు ప్రేక్షకులని అలరించాయి. మహేష్, జూనియర్ ఎన్‌టిఆర్ నటించిన 'శ్రీమంతుడు', 'జనతాగ్యారేజ్' లాంటి సందేశాత్మక చిత్రాల్లో 'పోరా శ్రీమంతుడా'....'రాక్ ఆన్....' పూర్తిగా సైకిల్‌పై చిత్రీకరించిన పాటలు హిట్ సాంగ్స్‌గా నిలిచాయి. కాలాన్నిబట్టి సినిమాల్లో థీమ్ మారుతున్నా యువతలో సైకిల్‌పై క్రేజ్ మాత్రం అలానే వుంది.

ట్రింగ్.. ట్రింగ్



సనీల్ శెట్టి భారత్ టేబుల్ టెన్నిస్‌లో ఇప్పుడో సంచలనం. అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో తమ జట్టును గెలిపించుకున్న సనీల్ ఎడమ చేతివాటం ఆటగాడు. అతడి ఫోర్‌హ్యాండ్ స్మాష్‌లు, టాప్ స్పిన్నులు అంతర్జాతీయ వేదికల మీద కూడా చర్చకు కారణమవుతున్నాయి. రియో ఒలింపిక్స్‌లో రజతాన్ని గెలుచుకున్న పెట్రిస్సా సొలిజా జట్టును చిత్తు చేయడంలో సనీల్ స్మాష్‌లు ఉపయోగపడ్డాయి. ఫిబ్రవరిలో 285వ ర్యాంకులో ఉన్న సనీల్ ఆగస్టు నాటికి 160వ ర్యాంకుకు చేరువయ్యాడు. దేశంలో నెం.1 టీటీ క్రీడాకారుడైన ఈ విజేత కథలో గుండె కదిలించే ఘట్టాలు కూడా ఉన్నాయి.

టీటీ సంచలనం

ముంబైకు చెందిన కుటుంబంలో హృద్రోగంతో పుట్టాడు సనీల్. గుండెలో రంధ్రం ఉండటంతో ఎనిమిది నెలల కన్నా ఎక్కువ రోజులు బతకడని వైద్యులు చెప్పేశారు. ఇది 1989 నాటి మాట. కానీ ఈ గట్టి పిండం బతికి టీటీ ర్యాకెట్ పట్టుకుంది. 2019కి అంతర్జాతీయ టాప్ ప్లేయర్లలో ఒకడుగా నిలవనుంది. ఐదేళ్ల వయస్సు నాటికే సనీల్ పూర్తి ఆరోగ్యవంతుడయ్యాడు. అప్పటి వరకు శరీరాన్ని శ్రమకు గురిచేసే ఏ ఆటా ఆడనివ్వలేదు తల్లిదండ్రులు. అతడికేమో తోటి పిల్లల్లా ఆటల్లో మునిగిపోవాలని ఉండేది. కానీ ఆయా తోడులేకుండా బడికి వెళ్లడమే కష్టంగా ఉండేది. శ్వాస సమస్య తీవ్రంగా ఉండేది. ఇలాంటి సనీల్‌ను ఇక ఆటలు ఎలా ఆడనిస్తారు. కానీ అతడి మీద ఆటల ప్రభావం తీవ్రంగా ఉండేది. ముఖ్యంగా తండ్రి టీటీ ఆటగాడు కావడం వల్ల. అన్న కూడా టీటీలో ప్రశంసలు దక్కించుకోవడం వంటివి సనీల్‌ను కూడా టీటీ వైపు ఆకర్షించింది. ఓ రోజు అన్న సచిన్ శెట్టి ఓ ట్రోఫీతో ఇంటికి వచ్చాడు. ముంబై విశ్వవిద్యాలయం పోటీల్లో దాన్ని గెలుచుకున్నాడు. దాన్నే తదేకంగా చూస్తున్న సనీల్ ఆసక్తి గమనించిన తండ్రే ధైర్యం చేసి 1998లో సనీల్‌కు తొమ్మిదో ఏట నుంచి టీటీ నేర్పాడు. ఇంట్లో ఆర్థిక పరిస్థితుల కారణంగా అన్న సచిన్ క్రీడాకారుడిగా కావాలన్న లక్ష్యం నుంచి తప్పుకుని కోచ్‌గా మారి అంతో కొంతో తండ్రికి సాయపడేవాడు. సనీల్‌కు కూడా అతడే గురువుగా మారాడు. తొలుత శారీరక దృఢత్వంపైనే దృష్టి పెట్టిన సనీల్ క్రమంగా రోజుకు 6 గంటల పాటు టీటీ ప్రాక్టీస్ చేయడం మొదలెట్టాడు. రోజుకు గంటపాటు ఫిట్‌నెస్ వ్యాయామాలు అదనం. ఇలా తన బలహీనతను జయించాడు. ఒకప్పుడు తోడు లేకుండా వీధి మలుపు వరకు కూడా వెళ్లలేని సనీల్ ఆ తర్వాత మూడు కి.మీ.లు ఆగకుండా పరుగెత్తేంత శక్తి,సామర్థ్యాలను పెంచుకున్నాడు. ముంబైకు చివరి చాంపియన్ కమలేష్ మెహతాగా ఉండేవాడు. ఆయన సనీల్ ఆటను చూసి మెచ్చుకున్నాడు. ఆయన స్థానాన్ని భర్తీ చేస్తూ సనీల్ దూసుకుపోయాడు. నేహా అగర్వాల్‌తో కలసి మిక్స్‌డ్ డబుల్స్‌లోను చెలరేగిపోయాడు. 2010లో అండర్-21 విభాగంలో యు.ఎస్. ఓపెన్‌లో స్వర్ణం సాధించాడు. పాట్నాలో నిర్వహించిన 75వ టీటీ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాడు. 2014 జాతీయ చాంపియన్‌గా అవతరించాడు.

స్టార్ దొరికాడు

మనదేశంలో 2015లో నిర్వహించిన కామన్వెల్త్ గేమ్స్ టేబుల్ టెన్నిస్‌లాంటి క్రీడల్లో దేశానికి భవిష్యత్తు ఉందని తెలిసేలా చేశాయి. టీటీలో కాంస్యం గెలిచిన సనీల్ శెట్టి ప్రతిభ కూడా అప్పుడే వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది నిర్వహించిన హంగేరియన్ ఓపెన్‌లో భారత టాప్ ప్లేయర్ అయిన శరత్ కమల్‌తో కలసి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోను మెరిశాడు. ఫస్ట్ డివిజన్ పోలిష్ క్లబ్బులకు ఆడాడు. కోచ్ మస్సిమో కొస్టాంటినీ సనీల్‌తోపాటు మిగతా క్రీడాకారుల ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టడంతో పవర్ గేమ్ శైలి పెరిగింది. తన వ్యక్తిగత కోచ్ పీటర్ ఎంగెల్‌తో కలసి వ్యూహాలు అల్లే సనీల్‌కు బ్యాక్‌హ్యాండ్ పట్టు కూడా ఇప్పుడే మెరుగవుతోంది. ఇండోర్‌లోని శిక్షణా కేంద్రంలో ప్రపంచ యాత్రలకు సన్నద్ధమయ్యే సనీల్ ఇప్పుడిప్పుడే టేబుల్ టెన్నిస్‌కు భారత్‌లో మంచి స్పందన వస్తోందని అంటున్నాడు. జర్మనీకి చెందిన టీటీ దిగ్గజం టిమో బోల్, జపాన్ స్టార్ ఆటగాడు మిజుటానీ జున్‌లు సనీల్‌కు స్ఫూర్తి. రాబోయే నైజీరియా, బల్గేరియా, చెక్ రిపబ్లిక్ ఓపెన్‌లలో సత్తా చాటితే వచ్చే ఏడాది కామన్‌వెల్త్ క్రీడా పోటీల్లో దేశానికి ఓ పతకం సనీల్ నుంచి ఆశించొచ్చని కోచ్‌లు విశ్వాసంతో ఉన్నారు. జర్మన్ లీగ్ పోటీల నాటికి సనీల్ టాప్-100లోకి వచ్చేస్తాడని అంచనాలున్నాయి. టీటీలో టాప్-10లోకి చేరి దేశంలో ఆ క్రీడకు ఆదరణ పెరిగేలా చేయాలనేది అతడి లక్ష్యం. ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించాలనేది ఆకాంక్ష.

ఇండెక్స్

స్ఫూర్తి 3
ఓ అమ్మకథ

స్టార్........4
దృశ్య రచయిత్రి

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం...........10
కాలు కదపని యాత్రికురాలు

తెలుసా............... 11
ఓ మూలవాసీ..!

కవిత్వమ్...............14
కర్షకుడి కంట కన్నీరు

స్నేహం.. త్యాగం.. విప్లవం..

అట్టమీది కథ...6

మంచిమనసులు ఆపాత చిత్రం- 12

కథ 15
విద్యార్థి

కొత్త పుస్తకాలు 18
కథా సాహిత్యంలో సరికొత్త ప్రయోగం

వివరం...........20
నిద్రొస్తే అంతే..

రుచి.......................21
ఫ్రాన్స్ పిజ్జా

బాల నేస్తాలు.............23
పొడుగు కాళ్ళ ఫ్లెమింగో

పద వికాసం........24

మెకానిక్ మహిళ

ఈ వారం స్నేహ అట్టమీది కథ ఆసక్తికరంగా వుంది. హర్యానాకు చెందిన ఉమేష్ దేవి మెకానిక్‌గా తన సమర్థతను చాటుకొంటున్న కథనం సందేశాత్మకంగా వుంది. మెకానిక్ రంగంలో అడుగు పెట్టి తన నైపుణ్యాన్ని ప్రదర్శించి మెకానిక్ మహిళగా ఆమె పేరు తెచ్చుకోవటం ఆశ్చర్యపరిచింది. అమ్మాయిలు అబలలు కాదు సబల అని నిరూపించిన దేవికి అభినందనలు. పెద్దపులి జీవిత విశేషాలు దాని ఆహారపుటలవాట్ల గురించి ఈ వ్యాసంలో లోతుగా వివరించింది. నాగరికత పేరుతో ప్రపంచ వ్యాప్తంగా పులుల సంఖ్య తగ్గిపోవటం ఆందోళన కలిగిస్తోంది. బ్రిటీషు ప్రభుత్వ హయాంలో వేటకు గురై 80 వేల పులులు మృత్యువాత పడటం శోచనీయం. మన జాతీయమృగం పెద్ద పులి జాతిని రక్షించుకోవాలి. విచక్షణా రహితంగా అడవుల్ని నిర్మూలించే చర్యల్ని మానుకోవాలి.

-మంకు శ్రీను, కొప్పరు.

మధురై ఆలయం అట్టబొమ్మలా?

పెయింటింగ్ కళలో ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన రఘురాజాపురంగ్రామం విశేషాలు ప్రత్యేకంగా ఆకర్షించాయి.



విదేశీ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అనేక ప్రశంసలు, అవార్డులు సాధించిన మనదేశపు చిత్రాలు సామాజిక అంశాలు అబ్బురపరిచాయి. అర్జున్ సినిమాలో మధురమీనాక్షి ఆలయాన్ని యధాతథంగా సృష్టించిన కళాకారుడు తోట తరుణి గొప్ప స్టార్. తెల్లవారి జాతి వివక్షను ఎదిరించిన నెల్సన్ మండేలా జీవిత చరిత్ర ఉత్కంఠను రేకెత్తించింది. ఆనాడు ఉద్దండులైన రచయితలే దర్శక నిర్మాతలు మిస్సమ్మకు ఎంటర్‌టెయినింగ్‌గా మెరుగులు దిద్దిన విశేషాలు పులకింపజేశాయి.

...

గ్రేట్ లేడీ షాలినీ

అరుదైన బ్యాక్టీరియా వల్ల శరీరంలో ఇన్‌ఫెక్షన్ పెరిగి షాలినీ సరస్వతి తన కాళ్ళూ చేతులూ పోగొట్టుకున్నా, సపోర్టింగ్ లెగ్స్‌తో 10కె పరుగు పందెంలో పాల్గొనడం ఉద్వేగ పరిచింది. మహిళలపై అత్యాచారాలను నిరసిస్తూ సుజాతా ఘోష్ 'ఆవు' మహిళతో ఫోటోలు తీయించి జనాల్లో ప్రచారాన్ని సాగించడం అభినందనీయం. సముద్రాల్లో అట్టడుగున తిమింగలాలు నిద్రపోతున్న అపురూపమైన ఛాయాచిత్రాలు ఆశ్చర్య పరిచాయి. అమెరికాలో ఆరేళ్ళ చిన్నారి టియారా మేటి గాయనిగా బాల మేధావిగా కూడా రాణించడం ఆనందింపజేసింది.

-టి. సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం

ఆకట్టుకున్న అట్టమీది కథ

ఈ వారం స్నేహ సంచిక సూపర్బ్. ప్రపంచవ్యాప్తంగా తగ్గుముఖం పడుతున్న పులులపై అట్టమీది కథ ఆకట్టుకుంది. ప్రతి వారం ఆలోజింపచేసే కథనాలని ప్రచురిస్తున్న స్నేహకు అభినందనలు. సపోర్టింగ్ లెగ్స్‌తో 10కె పరుగు పందెంలో పాల్గొన్న గ్రేట్ లేడీ షాలినీ కథనం ఉత్కంఠను రేకెత్తించింది. అట్టచివరి బొమ్మలు అలరించాయి. నవ్వుల్ పువ్వుల్ నవ్వు తెప్పించాయి.

-అంజలి, అనంతపురం.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

సుసాన్ ట్రిమార్కో ఒకప్పుడు ఒక సాధారణ గృహిణి. కుటుంబమే తన ప్రపంచం. ఓ రోజు తన కూతురు హటాత్తుగా తప్పిపోయింది. సెక్స్ ట్రాఫికర్స్ వలలో చిక్కుకుందని తెలిసి తల్లి గుండె బద్దలయ్యింది. తనని వెతికి పట్టుకోవడంలో పోలీసు యంత్రాంగం విఫలమైతే ఆ పనిని తన భుజాలకెత్తుకుంది. మానవ అక్రమ రవాణాని అడ్డుకునే కార్యకర్తగా మారి దాదాపు 2300 మంది మహిళలని ట్రాఫికర్స్ చెర నుండి కాపాడింది. 2013లో మ్యారియా కేస్‌లో కోర్టు కొందరిని దోషులుగా ప్రకటించింది. అదే సంవత్సరం నోబుల్ శాంతి అవార్డుకి ఎంపికైంది ట్రిమార్కో. కూతురి కోసం తను చేస్తున్న ఆ నిర్విరామ కృషేంటో మీరూ తెలుసుకోండి.

ఓ అమ్మ కథ

సుసాన్ ట్రిమార్కోని ఇప్పుడు ఎన్నో ప్రశ్నలు చుట్టిముట్టాయి. తప్పిపోయిన తన కూతురి కోసం తను చేయని ప్రయత్నమంటూ లేదు. ఏ ఒక్క ప్రయత్నంలోనూ తనని దక్కించుకోలేక పోయిందనే బాధ, ఆవేశం తన ముఖంలో స్పష్టంగా కనిపిస్తాయి. ట్రాఫికర్స్ చెర నుండి కొందరినైనా కాపాడగలిగిన ధైర్యం తప్ప తనకింకా ఊరట దొరకలేదు. నిజానికి ట్రిమార్కో. అనుభవిస్తున్న ఈ బాధంతా పద్నాలుగేళ్ళ క్రితం తప్పిపోయిన తన ఒక్కొగానొక్క కూతురు మారియా డి ఏంజెలెస్ వెరోన్ కోసం. ఉత్తర అర్జెంటినాలోని తమ ప్రాంతంలో ఓ రోజు హాస్పిటల్‌కి వెళుతున్న మ్యారియాని కొందరు అపహరించారు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కంగారు పడ్డ ట్రిమార్కో అమె కోసం ఆరాతీసింది. ఎక్కుడా ఆచూకీ దొరకలేదు. పోలీసులకి ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదు. కూతురి మిస్సింగ్ కేస్ విషయంలో పోలీసుల జాప్యం ఎక్కువవడంతో తనే స్వయంగా వెతికి పట్టునే ప్రయత్నం మొదలుపెట్టింది. అప్పుడే తనకి మారియా గురించి కొన్ని నిజాలు తెలిసాయి. కొందరు మారియాని కార్‌లో బలవంతా ఎక్కించడం తను చూశానంటూ ఓ సైకిల్ వాలా చెప్పుకొచ్చాడు. మ్యారియా అపహరణకి సంబంధించి.... తమ బంధువొకరు కొన్ని విషయాలని ప్రస్తావించారు. అయితే పోలీసులకి సాక్ష్యం చెప్పేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఆ తర్వాత మ్యారియా సెక్స్ ట్రాఫికర్స్ వలలో చిక్కుకుందనే నిజాలు గుండెల్ని మెలిపెట్టాయి. ఎలా అయినా మ్యారియాని వెతికి పట్టుకోవాలనేదే ట్రిమార్కో తపనంతా. నగరంలో వేశ్యా గృహాలని నిర్వహిస్తున్న వారి పేర్లు, ప్రాంతాల ఆచూకీని తెలుసుకుంది. అయితే అక్కడ అడుగు పెట్టడం ఒక పెద్ద సమస్య. ఏ మాత్రం అనుమానం వచ్చినా ప్రాణాలు దక్కే అవకాశమే లేదు. అందుకోసం వేశ్యగా మారువేషంలో ఓ పెద్ద సాహసమే చేసింది ట్రిమార్కో. అలా ఓ వేశ్యా వాటికలోకి ప్రవేశించిన తనకి మారియాని ఇక్కడే చూశామంటూ కొందరు చెప్పుకొచ్చారు. ఆ మాటులు విన్నాక త్వరగా మారియాని చూడాలనే కోరిక బలపడింది. అయితే మారియా మాత్రం తనకెప్పుడూ కనిపించలేదు. ఎవరికీ అనుమానం రాకుండా వుండేలా జాగ్రత్తగా ఎన్నో ప్రయత్నాలు చేసింది. ఎలా ప్రయత్నించినా తన గురించి అంతో కొంత సమాచరమే తప్ప మారియాని తనెప్పుడూ కలవలేదు. ఇదే ట్రిమార్కోని కలచివేసే విషయం. మారియా ఆచూకి కోసం తను చేసే ప్రయత్నంలో ఎన్నో ధైర్యవంతమైన నిర్ణయాలనే తీసుకుంది. ఆ ధైర్యమే తనని ఒక గొప్ప మానవ హక్కుల కార్యకర్తగా తీర్చిదిద్దింది. అప్పుడే తనకి లైంగిక అక్రమ రవాణా, అవినీతికి సంబంధించి కొన్ని నిజాలు వెలుగులో కొచ్చాయి. మహిళలని నిర్బంధించి పోలీసులే వేశ్యా గృహాలకి బలవంతంగా తరలిస్తున్నారనే విషయాలు గగుర్పాటుకి గురిచేశాయి. అలా లైంగిక అక్రమరవాణా నుండి ఒక సారి 129 మంది అమ్మాయిలకి విముక్తి కలిగించి తన ఇంట్లోనే ఆశ్రయం ఇచ్చింది. ఆ తర్వాత వాళ్ళని తమ కుటుంబసభ్యుల వద్దకి చేర్చింది. ఈ ఉదంతం మీడియా ద్వారా అన్ని ప్రాంతాలకీ తెలిసింది. 2008లో ఓ సంచలన వార్తగా నిలిచింది. ఇలా ట్రిమార్కో అక్కడ తెచ్చిన చైతన్యంతో అక్రమ రవాణాని ఒక ఫెడరల్ నేరంగా పరిగణిస్తున్నట్టు అక్కడి ప్రభుత్వం ఒక చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ పరిణామం తర్వాత కొందరు తనని ఈ పనులన్నిటినీ మానుకొమ్మంటూ బెదిరించారు. ఇంటికి నిప్పంటించారు. ట్రిమార్కో అలాంటి వాటికి బెదిరిపోలేదు. మరింత ధైర్యంతో ముందడుగేసింది. వందలాది కుటుంబాలు తన వద్దకి సాయం కోసం వచ్చేవి. అలాంటి వారికోసం 'మారియా ది లాస్ ఏంజెల్స్' పేరున ఓ స్వచ్ఛంద సంస్థను స్థాపించింది. మారియా కేసు కోర్టులో ఒక సంచలనంగా మారింది. కోర్టు ట్రయల్‌లో పదమూడు మందిని దోషులుగా గుర్తించింది. వాళ్ళలో పోలీసులు కూడా వుండడం ఒక సంచలనం. మరో ముగ్గురు న్యాయమూర్తులపై అభిశంసన ప్రకటించారు. 2013లో జరిగిన రీ ట్రయిల్‌లో మారియా మిస్సింగ్ కేస్‌లో కోర్టు పదిమందిని దోషులుగా ప్రకటించింది. మారియా అక్రమ రవాణా ఉచ్చులో చిక్కుకుందనేది ధృవీకరించినా ఇప్పటి వరకు తన ఆచూకీ మాత్రం దొరక్కపోవడం విచారకరం. మారియాని విదేశాలకు తరలించారంటూ, తన ఆచూకీ తెలీకుండా హత్య చేశారంటూ భిన్న కథనాలు బయటికొచ్చాయి. మారియా ఆచూకీ తెలీక తన మనసంతా దుఃఖాన్ని అలుముకున్నా, లైంగిక అక్రమ రవాణాకి వ్యతిరేకంగా తన కార్యాచరణని ఇంకా కొనసాగిస్తోంది ట్రిమార్కో. ఇలా తను సాయపడిన మహిళల్లో ఏ ఒక్కరైనా మారియాకి ఏదోవిధంగా సాయపడతారనే ఆశ తనది.

- శర్వాణి



దృశ్య రచయిత్రి

కెమెరామెన్ అనగానే ఊహల ఫ్రేమ్‌లోకే ఓ మహిళ రారు. కానీ ఎప్పుడో బి.ఆర్.విజయలక్ష్మీ కెమెరామెన్ సీట్లో కూర్చున్నారని చాలామందికి తెలీదు. ప్రస్తుతం దేశంలో రాణిస్తున్న మహిళా సినిమాటోగ్రాఫర్లు 60 మందికి పైనే ఉన్నారు. వారిలో సంచలనంగా మారిన సవితా సింగ్ గురించి తెలుసుకుంటే వావ్ అని మీరే అనేస్తారు. విజువల్స్ మీదే ఎక్కువగా ఆధారపడే హార్రర్ చిత్రాల నుంచి పీరియాడికల్స్ వరకు ఆమె కెమెరా కన్ను అద్భుతాల్ని ఆవిష్కరిస్తుంది. విజువల్ పొయెట్రీని అందించగల ఆమె గురించి ఈ వారం స్టార్.

- ఢిల్లీ చెందిన సవిత 'దూరదర్శన్'ను చూస్తూ పెరిగింది. 80ల నాటి సినిమాలు ఎక్కువ ప్రభావం చూపాయి.
- చిన్నపుడు చదివిన కథల్ని చిత్రాలుగా తీయాలని ఆరాటపడేవారు. దూరదర్శన్‌లో డిప్లొమా ఫిల్మ్స్ చూసి కెమెరామెన్‌గా స్థిరపడాలనే ఆలోచనకు బీజం పడింది.
- సత్యజిత్ రే, ఆదూరు గోపాల్‌కృష్ణ, అపర్ణా సేన్ చిత్రాలు ఆమెను కట్టిపడేసేవి. వారే ఆమె సినిమా రంగం వైపు రావడానికి ప్రేరణ.
- గురుదత్ చిత్రం 'ప్యాసా'లోని ఓ పాటను చూసి ఆమె సినిమాటోగ్రఫీ మీద ఆసక్తి పెంచుకున్నారు.
- మాస్ కమ్యూనికేషన్ పూర్తి చేశాక సవితా పుణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో సినిమాటోగ్రఫీ నేర్చుకున్నారు. 'స్టేట్స్‌మెన్'కు పనిచేశారు. అంతర్జాతీయ చిత్రాల్ని ఎక్కువగా చూశారు. రష్యన్, ఇటాలియన్ చిత్రాలు మాస్ కమ్యూనికేషన్ చేయకముందే చూడటం అలవాటు చేసుకున్నారు.
- 'టు బీ కంటిన్యూడ్' (క్రమశా) (2007) డిప్లొమా ఫిల్మ్‌తో సంచలనం సృష్టించారు సవితా సింగ్.
- ఇదో ప్రయోగాత్మక చిత్రం. విజువల్స్ దీనికి ఆధారం. జానపదాలు, ప్రకృతి చుట్టూ తిరిగే కలలతో కథ నడుస్తుంది. దీనికి జర్మనీలోని ఒబెర్‌హాసెన్ చిత్రోత్సవంలో ఉత్తమ ఛాయాచిత్రకళ పురస్కారం అందింది. జాతీయ పురస్కారం కూడా దక్కింది.
- ఈ డిప్లొమా ఫిల్మ్‌కు అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా 14 మంది సినిమాటోగ్రఫీ విద్యార్థులను గుర్తించే 'మాస్టర్ క్లాస్' కార్యక్రమానికి ఆమె ఎంపికయ్యారు.
- 'రంగ్ దె బసంతి', '1942 ఎ లవ్‌స్టోరీ', 'దేవదాస్' (హిందీ) వంటి మాస్టర్‌పీస్‌లు తీసిన సినిమాటోగ్రాఫర్ బినోద్ ప్రధాన్ దగ్గర అసిస్టెంట్‌గా పనిచేశారు.
- ఇది చూసే రామ్‌గోపాల్ వర్మ ఆమెను 'ఫూంక్' (2008) చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా తీసుకున్నారు. ఆమె మోంటెజ్‌లు, విజువల్స్ హడలెత్తిస్తాయి. హార్రర్ చిత్రాల్లో ఎవరో వెన్నాడుతున్న అనుభూతి దృశ్యాల్లో ఆవిష్కరించి సినిమాకు బలం పెంచారు.
- 'డాహ్లిజ్ పార్', 'ఫ్యామిలీ' వంటి టీవీ మూవీ డాక్యుమెంటరీలు, 'సమ్‌థింగ్ లైక్ లవ్' వంటి షార్ట్‌ఫిల్మ్స్‌తోను పేరు తెచ్చుకున్నారు.
- 'కిస్మత్ లవ్ పైసా ఢిల్లీ', 'ది సెవెంత్ వాక్', 'జల్పారీ'లకు ప్రశంసలు అందుకున్నారు.
- 2009లో బాలీవుడ్ దర్శకుడు విభు పూరిని ఆమె వివాహమాడారు.
- '404 ఎర్రర్ నాట్‌ఫౌండ్' హార్రర్ చిత్రానికి తన కెమెరా వర్క్‌తో ప్రాణం పోశారు. యాడ్ ఫిల్మ్స్, మ్యూజిక్ వీడియోలకు కూడా ఆమె పనిచేశారు.
- ప్రియాంక చోప్రా, బొమన్ ఇరానీ, అశుతోష్ గోవారికర్ నటించిన మరాఠి చిత్రం 'వెంటిలేటర్'కు కూడా ఆమె పనిచేశారు.
- ప్రపంచంలోనే తొలి విమానాన్ని రూపొందించినది మన భారతీయుడు శివ్‌కర్ తల్పాడే అని వచ్చిన 'హవాయ్‌జాదే' చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించారు.
- ఈ చిత్రం మొత్తం 1895 నాటి ముంబైను వీక్షకులకు చూపించింది. ఆ కాలానికి అనుగుణంగానే కాక దృశ్యకావ్యంగాను మలచడంలో మంచి మార్కులు వేయించుకున్నారు సవితా.
- ఆమె పనితనం వల్లే ఆ చిత్రానికి బాంబై ఫెయిరీ టేల్ అనే పేరు వచ్చింది. బ్లూస్, గ్రీన్స్‌లో చిత్రీకరణ చేయాలని ఆమె ఒప్పించగలిగారు. టెలీఫొటో లెన్స్ అనుభూతిని తెచ్చారు.
- సాఫ్ట్‌గా దృశ్యం కనిపించడానికి లైటింగ్, రంగుల మేళవింపు, సాచ్యురేషన్ విషయాలను దగ్గరుండి చూసుకున్నారు. నలుపు తెలుపుల్లో పాత కాలాన్ని తేలిగ్గా ఒప్పించొచ్చు కానీ రంగుల్లో పాత కాలాన్ని అనుభూతి కలిగించడం కష్టం. కానీ సవితా ఈ విషయంలో విజయవంతమయ్యారు.
- మతోన్మాదాన్ని ఎండగట్టే పోస్టులను ఆమె సామాజిక మాధ్యమాల్లో ఎక్కువగా షేర్ చేస్తుంటారు. హిందీ సాహిత్యమంటే ఆమెకు ప్రాణం. మంటో, వినోద్ శుక్లా వంటి వారి రచనల్ని ఎక్కువగా చదివారు.

- జేఎస్

నవ్వుల్ - పువ్వుల్

ఎడ్జెస్ట్‌మెంట్

అత్త : అదేంటి అట్లు మాడిందన్నందుకే అలా ముఖం మాడ్చుకున్నావు. సర్దుకుపోవాలి గానీ.

కొత్తకోడలు : అందుకే బ్యాగు సర్దుకుంటున్నా..... మా ఇంటికెళ్లడానికి.

అతితెలివి

టీచర్ : రాజు గుప్త నిధి అంటే ఏమిటి?

రాజు : గుప్తులు పాలించే కాలంలో ప్రజలు దాచుకున్న నిధి టీచర్!

కానుక

తండ్రి : నీ పుట్టిన రోజుకి ఏం గిఫ్ట్ కావాలి.

చింటు : పెద్దగా ఏం వద్దులే డాడీ..... అమ్మ రేడియో కొనిచ్చింది. అది పెట్టుకోడానికి ఒక కారు కొనిస్తే చాలు.



ఆ సమయానికి

వెంగళప్ప : ఏమండి టైమ్ ఎంతైంది.

మురళి : ఎనిమిదైంది.

వెంగళప్ప : ఛ.....పొద్దున్నుంచి ఎవరూ సరైన టైమ్ చెప్పట్లా....ఒక్కొక్కరూ ఒక్కో టైమ్ చెబుతున్నారు.

కిసుక్కు

కాంతం : చిట్టి పెళ్ళి చూసే వరకు నన్ను ఎలాగైనా బతికించండి డాక్టర్.....

డాక్టర్ : చిట్టి మీ మనవరాలా .....??

కాంతం: కాదు సీరియల్‌లో హీరోయిన్....

డాక్టర్ : ఆ.....

జీనియస్

చింటూ : అమ్మా ......నేను స్కూల్‌కు వెళ్ళను

తల్లి : ఎందుకు?

చింటూ : మా టీచర్స్‌కి ఏమీ తెలియదు ప్రతి ప్రశ్న నన్నే అడుగుతున్నారు .

భరోసా

డాక్టర్ : మీరు భయపడకండి నేనున్నానుగా....

రోగి : మీరు వుంటారు. ఆపరేషన్ తర్వాత నేను ఉంటానో వుండనో అనేదే నా భయం.

కిసుక్కు సిత్రం

ఏసేస్తా ఏమనుకుంటున్నావో..!

నాకు నచ్చిన చిత్రం

ఇల్లస్ట్రేటర్ : పావెల్ వుయిజ్కి

సేకర్త: పి.బాలు, మచిలీపట్నం

అట్టమీది కథ

స్నేహం.. త్యాగం.. విప్లవం



- భవిష్య
9490300371

ఎక్కడో పుట్టిన చే, మరోచోట జన్మించిన కాస్ట్రోల స్నేహం ఆధునిక ప్రపంచంలో అరుదైన చరిత్ర సృష్టించింది. 19వ శతాబ్దంలో కారల్ మార్క్స్, ఫెడరిక్ ఏంగెల్స్ జంట స్నేహం ప్రపంచంలో పెనుమార్పులకు కారణమయ్యింది. 20వ శతాబ్దంలో అరుదైన స్నేహం ఫైడల్ కాస్ట్రో, చే గువేరా జంట. ఈ స్నేహపు జంట ప్రపంచాన్ని కుదిపేసింది. ఇప్పటికీ కుదిపేస్తూనే ఉంది. ఇంకా ప్రపంచాన్ని కదిలించే సూచనలే కనిపిస్తున్నాయి. కష్టాల్లో చేదోడు వాదోడుగా ఉండటమంటే యిదే సుమా, స్నేహమంటే ఇదే సుమా అనేంతగా! వారు ఎక్కడా రాజీపడని ధృఢచిత్తంతో నిలిచారు. వీరోచిత ప్రజ్ఞకి వారి స్నేహం చిహ్నం. ప్రతిఫలం ఆశించకుండా తోడై నిలచిన స్నేహం వారిది.

ఆశయ బలంతో...

ఈ జంట విలువైన జీవితాన్ని ప్రపంచ గమనానికి కత్తుల వంతెన కట్టి నడిపింది. 'కలకానిది విలువైనది జీవితం' అన్నాడు.. శ్రీశ్రీ. వ్యక్తిగత లక్ష్యాలతో లాభనష్టాలూ కష్టసుఖాలు ఆయా వ్యక్తుల వరకే పరిమితం అవుతాయి. అదే మన సమాజానికి బాధ్యత వహించినప్పుడు సమిష్టి

మానవుడు స్వతహాగా సంఘజీవి. స్నేహంతో కలసి ఉంటూ అభివృద్ధి సాధించాడు. అందుకే సృష్టిలో మధురమైందీ స్నేహం అన్నారు. అందుకే ఒక కవి అంటారు.. "స్నేహ బంధమూ ఎంత మధురమూ... చెరిగిపోదు. తరిగిపోదు.. జీవితాంతమూ... కష్టసుఖాల్లో.. తోడూ నీడగా.. ఒకే ఆత్మ ఉంటుంది రెండు శరీరాలలో.. ఒకటే పలుకుతుంది వేరు వేరు గుండెల్లో..!" సహవాసానికి కులం లేదు. మతం లేదు. స్థలం లేదు. భాష లేదు. లింగ బేధం లేదు. సరిహద్దులు అసలే ఉండవు. చేగువేరా-కాస్ట్రో స్నేహబంధం అటువంటిదే.

లక్ష్యంగా మారుతుంది. దాని ప్రభావం మొత్తం సమాజంపైనా ఉంటుంది. ఈ ఇద్దరి స్నేహితుల దృష్టిలో జీవిత లక్ష్యం మానవజాతి సుఖసంపదలతో జీవించడం. భౌతికంగానూ, సాంస్కృతికంగానూ అంతకంతకు ఉన్నత శిఖరాలకు అందుకోవడం. ప్రతి మానవుడు తోటి వారితో కలిసి మానసిక శక్తులను అభివృద్ధి చేసుకోవడానికి అంతకంటే ఎక్కువ స్వేచ్ఛ సంపాదించడం. దాన్ని సాధించాలంటే పెట్టుబడిదారీ పద్ధతులు ఎన్నటికీ పనికిరావు అని ఇద్దరూ నమ్మారు. బాధలు లేని సమాజం కోసం పాటు పడాలి. ఏదీ తనంత తానై నీ దరికిరాదు. శోధించి సాధించాలి అదే ధీరగుణం అన్నట్లు వీరిద్దరూ ధీరగుణం ప్రదర్శించారు. అందుకే ఆదర్శ సమాజ నిర్మాణానికి అరుదైన స్నేహితులుగా నిలిచారు. స్నేహానికి కొత్త అర్థం చెప్పారు. ఆశయబలంతో కాలానికి ఎదురీదిన స్నేహం వారిది.

ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి...

ఎర్నెస్టో గువేరా జూన్ 14, 1928న అర్జెంటీనాలోని రోసారియోలో బాస్క్ మరియు ఐరిష్ మూలాలుగల స్పానిష్ కుటుంబంలో జన్మించారు. జీవితాంతం తనను బాధపెట్టిన ఆస్తమా వలన వికలత్వంతో బాధపడినప్పటికీ, ఆయన ఒక అథ్లెట్‌గా రాణించారు. ఆయన ఆసక్తిగల రగ్బీ ఆటగాడు. ఈత, సాకర్, గోల్ఫ్, షూటింగ్ వంటి క్రీడలతో ఆనందించే వారు. 'అలుపులేని' సైక్లిస్ట్‌గా కూడా తయారయ్యారు. యుక్త వయసులో మెడికల్ విద్యార్థిగా ఉన్న గువేరా

లాటిన్ అమెరికా అంతా పర్యటించారు. అక్కడున్న బీదరికం చూసి పరివర్తనం చెందారు. ఈ పర్యటనలతో దక్షిణ అమెరికా దేశాల్లో దారుణంగా ఉన్న ఆర్థిక తారతమ్యాలకు కారణం ఏకస్వామ్య పెట్టుబడిదారీ వ్యవస్థ, నూతన వలసవాదం, సామ్రాజ్యవాద ఫలితమేనని తుదినిర్ణయానికి వచ్చారు. దీనికి ఒకే ఒక్క పరిష్కారం తిరుగుబాటని భావించారు. డాక్టరు పూర్తిచేసిన చే సాంఘిక ఉద్యమాలలో పాలుపంచుకునేందుకు ప్రేరణనిచ్చింది. అంతిమంగా లాటిన్ అమెరికా దేశాలలో అమెరికా జరుపుతున్న కుట్రలు చే గువేరా కఠిన భావజాలాన్ని ధృఢపరిచాయి. తర్వాత మెక్సికో నగరంలో నివసిస్తున్నప్పుడు, అతను ఫిడేల్ కాస్ట్రోను కలిశారు. వారి ఉద్యమంలో చేరి... సిఐఏ మద్దతున్న క్యూబా నియంత బాటిస్టాను పదవీచ్యుతిన్ని చేసేందుకు జరిగిన తిరుగుబాటు దళాలలో భాగస్వామిగా మారారు. అప్పుడు కాస్ట్రోతో కలిసిన స్నేహం జీవితాంతం కొనసాగింది. గువేరా త్వరలోనే విప్లవకారులలో

ప్రముఖుడై, సైన్యంలో రెండవ స్థానానికి పదోన్నుతుడై, బాటిస్టా పాలనను తొలగించడంలో విజయవంతమైన రెండు సంవత్సరాల గెరిల్లా పోరాటంలో ప్రముఖపాత్ర వహించారు.

క్యూబా ప్రభుత్వంలో పాత్రధారిగా....

క్యూబా తిరుగుబాటు విజయం తరువాత, గువేరా నూతన ప్రభుత్వంలో అనేక ప్రధానపాత్రలను పోషించారు. రెవల్యూషనరీ ట్రిబ్యునల్స్‌లో యుద్ధ నేరస్థులుగా పరిగణింపబడినవారి వినతులు, ఫైరింగ్ దళాలను సమీక్షించడం, పరిశ్రమలశాఖా మంత్రిగా వ్యవసాయ సంస్కరణలను ప్రవేశపెట్టడం, జాతీయ బ్యాంకు అధ్యక్షునిగా మరియు క్యూబా సైనికదళాల బోధనానిర్దేశకునిగా, క్యూబన్ సామ్యవాదం తరపున దౌత్యవేత్తగా ప్రపంచపర్యటనలు చేయడం వంటివి వీటిలో ఉన్నాయి. డిసెంబరు 1964 నాటికి, చే గువేరా ఒక 'ప్రపంచస్థాయి విప్లవ రాజనీతివేత్తగా' ఎదిగారు.

అరుదైన అంతర్జాతీయ వాది

క్యూబా బృందానికి నాయకునిగా ఐక్యరాజ్యసమితిలో ఉద్వేగభరితమైన ప్రసంగం చేశారు. దక్షిణాఫ్రికాలో జరుగుతున్న 'హింసాత్మక వర్ణవివక్ష విధానం' అదుపు చేయలేని ఐక్యరాజ్యసమితి అశక్తతను విమర్శిస్తూ, "దీనిని అదుపు చేసేందుకు ఐక్యరాజ్యసమితి ఏమీ చేయలేదా?' అని ప్రశ్నించాడు. నల్లజాతీయుల పట్ల ఐక్యరాజ్యసమితి వైఖరిని ఖండించారు. ఈ 'ఇతిహాసం' ఆకలితో అలమటించే వారిచేత, భూమిలేని నిరుపేదలచేత, దోచుకోబడుతున్న కార్మికులచేత పురోగామిశక్తుల చేత రచింపబడుతుందని ప్రకటించారు. అల్జీర్స్లో ఫిబ్రవరి 24, 1965 ఆఫ్రో-ఆసియన్ ఐక్యతపై ఒక ఆర్థిక సమావేశంలో చేసిన ప్రసంగం అంతర్జాతీయ వేదికపై ఆయన కనబడిన చివరి బహిరంగ వేదిక. క్యూబా విదేశాంగ మంత్రి హోదాలో చే.. భారత్ సహా రష్యా, శ్రీలంక, జపాన్, చైనా తదితర దేశాల్లో పర్యటించి, కీలకమైన ఒప్పందాలు కుదుర్చుకుని క్యాస్ట్రో నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. అయితే అధికార నిర్వహణ కంటే విప్లవం పురుడుపోసుకుంటున్న మిగతా లాటిన్ అమెరికా, ఆఫ్రికన్ దేశాలకు తన సేవలు అవసరమని భావించిన చే గువేరా క్యూబా విడిచి బొలీవియా వెళ్లాలనుకున్నాడు. నిజానికి చే గువేరా లాంటి స్నేహితుడిని వదులుకోవ డానికి ఏ రాజనీతిజ్ఞుడూ సిద్ధపడడు. కానీ అది విప్లవ పోరాటం. అక్కడ వ్యక్తిగత స్నేహాలకు తావులేదు. అందుకే దేశాధినేతగా కాకుండా ప్రియమైన

కాంగో,
బొలీవియాల్లో
విప్లవోద్యమానికి కదిలినపుడు
క్యాస్ట్రోకు చే రాసిన ఒక లేఖ

ఫిడెల్,

ఈ క్షణం నాకు ఎన్నో సంగతులు గుర్తుకు వస్తున్నాయి. మనం మొదటిసారిగా మరియా ఆంటోనియా ఇంట్లో కలుసుకోవడం... నువ్వు మన ప్రయాణం గురించి చెప్పగానే మనం ఆ హడావిడిగా ఆ ప్రయత్నాలలో మునిగిపోవడంలాంటివెన్నో ఇవాళ నా హృదయంలో కదలాడుతున్నాయి. ఎన్నో అద్భుతమైన సమయాల్లో నీ పక్కన నిలబడగలిగినందుకు, తీవ్రమైన సంక్షోభ సమయాల్లో మనం ప్రజలతో మమేకమై పని చేయగలిగినపుడూ గర్వపడుతున్నాను. నీవంటి రాజకీయ నైపుణ్యం గల వ్యక్తులు అరుదుగా తారసపడతారు. నిస్సంకోచంగా నీతో కలసి నడవ గలిగినందుకు, మనిద్దరి ఆదర్శాలలోనూ, అంచనాల్లోనూ చాలా సాన్నిహిత్యం ఉన్నందుకు గర్వంగా ఉంది.

నాకున్న కొద్దిపాటి శక్తులతో ఇతర ప్రపంచంలోని, ఇతర ప్రాంతాలక్కూడా ఉపయోగపడటం అవసరమని భావిస్తున్నాను. క్యూబా బాధ్యతలను నీవు స్వీకరించావు కనుక, నువ్వు వదిలివెళ్లిన మిగిలిన బాధ్యతలను నేను పూర్తి చేయాలి. కాబట్టి ఇప్పుడు వీడ్కోలు తీసుకోక తప్పదు.

ఇప్పుడు నా హృదయం ఆనంద, విషాదాల కలబోతగా ఉందని నీవు అర్థం చేసుకోగలవు. ఈ దేశ విప్లవ నిర్మాతలలో ఒకడిగా నా ఆశయాలను నా ప్రియమైన ప్రజల మీద, నీ మీద వదిలి వెళుతున్నాను. నన్ను తమ కన్న బిడ్డలా ఆదరించిన ఈ ప్రజలను ఒదిలి వెళ్లడం ఎంతో బాధగా ఉంది. నువ్వు నాకందించిన స్ఫూర్తిని, నా ప్రజలు అందించిన విప్లవ చైతన్యాన్ని నా కర్తవ్య నిర్వహణలో భాగంగా పొందిన అవగాహననూ మరో కొత్త యుద్ధ రంగానికి మోసుకుపోతున్నాను. నేనే విదేశంలో వున్నప్పటి క్యూబన్ విప్లవకారుడిగా నా బాధ్యతలను గుర్తెరిగి నడుచుకుంటున్నాను.

నా భార్యాపిల్లలకు ఏ ఆస్తిపాస్తులు ఇవ్వకుండా వెళుతున్నాను. అందుకు నాకు ఎటువంటి చింతా లేదు. వాళ్ల జీవనోపాధికి, చదువులకు ప్రభుత్వమే బాధ్యతలు స్వీకరిస్తుందని తెలుసు కనుక ప్రత్యేకంగా నాకే కోరికలూ లేవు. నీకూ నా ప్రజలకూ ఇంకా ఎంతో రాయొచ్చు. కానీ అది పేలవంగా ఉంటుంది. నా భావాలను వెల్లడించడానికి మాటలు చాలనప్పుడు వూరికే కాగితాన్ని వృథా చేయడం అనవసరం. విప్లవం వర్ధిల్లాలి. జన్మభూమికి ప్రాణాలొడ్డుదాం. విప్లవాభినందనలతో ఆలింగనం చేసుకుంటూ...

– చే

స్నేహితుణ్ని పూర్తిగా అర్థం చేసుకున్న వ్యక్తిగా ఫైడల్ క్యాస్ట్రో.. చేగువేరాకు వీడ్కోలు పలికాడు. బొలీవియాలో ప్రభుత్వ సేనలతో పోరాడుతూ 1967 అక్టోబర్ 9న చే మరణించాడు.

క్యాస్ట్రో నాయకత్వం- క్యూబా విప్లవం

ఫైడల్ కాస్ట్రో క్యూబాలోని ఓరియంటే రాష్ట్రంలో 1926 ఆగస్టు13న జన్మించారు, హవానాలో స్కూలు విధ్యనభ్యసించి హవానా విశ్వవిద్యాలయంలో న్యాయవాద విద్యలో పట్టభద్రుడైనాడు. ఇక్కడే 1947లో ఆర్థడాక్స్ పార్టీలో సభ్యుడై విద్యార్థి నాయకునిగా నియంత బటిస్టాకు, అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. ఈ పోరాట అనుభవాలతో అతిత్వరలోనే క్యూబా సాయుధ పోరాటంతోనే విముక్తి సాధిస్తుందనే దృఢసంకల్పంతో 1953 జులై 26న శాంటియాగో డి క్యూబాలోని మాంకోడా సైనిక స్థావరంపై తిరుగుబాటు జరిపారు. కానీ కొన్ని సాంకేతిక, నిర్మాణ లోపాల వల్ల తిరుగుబాటు ఓడిపోయింది. బటిస్టా ప్రభుత్వం క్యాస్ట్రోతో సహా 24 మందిని నిర్బంధించింది. 60 మందికి పైగా తిరుగుబాటుదారులను హతమార్చారు. కాస్ట్రోకు 15 సంవత్సరాలు జైలు శిక్షను విధించారు. ఈ నిర్బందానికి వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాలు చేయగా 22 మాసాలకే క్యాస్ట్రో బృందాన్ని విడుదల చేశారు.1955 జులై 7న క్యాస్ట్రో మెక్సికో చేరుకుని క్యూబా విప్లవ తిరుగుబాటుకు సన్నాహాలు నిర్వహించాడు. ఇక్కడే ప్రపంచంలో అరుదైన స్నేహానికి అంకురార్పణ జరిగింది. మెక్సికోలో ఉన్న చే, క్యాస్ట్రోలు కలుసుకున్నారు. చర్చల అనంతరం ఇద్దరూ ఒకే బాట ను నడవాలనుకున్నారు. ప్రపంచ విప్లవోద్యమానికి, లాటిన్ అమెరికాలో ప్రజావిముక్తికి అంకితమయ్యారు.

అమెరికాను వణికించిన స్నేహం

ఈ ఇద్దరి స్నేహితుల నాయకత్వంలో 1956 నవంబర్‌లో గ్రాన్మా పడవలో 81 మంది తిరుగుబాటుదారులతో క్యూబా ప్రయాణమయ్యారు. ఈ ప్రయాణ విషయం పసిగట్టిన బాటిస్టా తన సైన్యాన్ని క్యాస్ట్రో బృందాన్ని అంతంచేయడానికి పంపాడు. ఈ అనుకోని ఈ దాడిలో తీవ్రంగా నష్టపోయారు. చాలా మంది చనిపోయారు. పదుల సంఖ్యలో మిగిలిన వారు చెల్లాచెదురై క్యూబాలోని సియెర్రామస్త్రా కొండల్లోకి పయనమై తిరిగి పుంజుకుని సాయుధ గెరిల్లా పోరాటంతో ప్రజలను సమీకరించి బాటిస్టా ప్రభుత్వాన్ని 1959 జనవరి 1న గద్దె దించారు. బాటిస్టా తప్పించుకుని పారిపోయాడు. అతని అనుచరులు పారిపోవడంలో కూడా అతన్నే అనుసరించారు. క్యాస్ట్రో 1959 ఫిబ్రవరి 16న ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించాడు. క్యాస్ట్రో

తన అనుచరులు 1960లలో క్యూబా కమ్యూనిస్టు పార్టీలో విలీనమైయ్యారు.

క్యూబా సోషలిస్టు దేశంగా అవతరించింది. అమెరికాతో గల సైనిక ఒప్పందాలను రద్దు చేసిన క్యాస్ట్రో దాని అస్తులను కూడా స్తంభింపచేశాడు. ఆ విప్లవ విజయాన్ని సహించలేని అమెరికా 1961 జనవరిలో క్యూబాతో దౌత్య సంబంధాలు తెంచుకోవడమే కాక దానితో ఎలాటి సంబంధాలు పెట్టుకోరాదని దారుణమైన ఆంక్షలు విధించింది. మరోవైపు సోవియట్ సోషలిస్టు శిబిరం క్యూబాతో సంఘీభావం ప్రకటించి సహాయసహకారాలు అందించింది. చే, ఫైడల్‌ల నాయకత్వంలో క్యూబా విద్య వైద్య రంగాలలో గొప్ప అభివృద్ధి సాధించింది. క్యూబా భారత దేశానికి కూడా గొప్ప మిత్రదేశంగా వుంది.

వెనుతిరగని ధీరత్వం

ఆర్థిక వ్యవస్థ తాలూకూ ప్రధాన ప్రాతిపదిక దెబ్బతిన్నప్పటికి అమెరికాకు తలవంచడానికి క్యూబా సిద్ధపడలేదు. తన రాజకీయ వాతావరణం మారిపోతున్నదని గ్రహించిన క్యూబా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. దేశంలో 'ప్రత్యేక పరిస్థితి' ప్రకటించి వున్న వనరులను పరిమితంగా వినియోగించుకునేలా ప్రజలను చైతన్య పరచింది. క్యాస్ట్రోపై 600 హత్యా ప్రయత్నాలు చేసింది సిఐఎ. ఐసెన్ హోవర్ నుంచి ఒబామా ఇప్పుడు ట్రంప్ విజయం వరకూ ప్రత్యక్షంగా చూసిన క్యాస్ట్రో ఆధిపత్యానికి ఎన్నడూ తలవంచలేదు. చివరకు వారే దిగివచ్చి సంబంధాలు పెట్టుకున్నారు. హ్యూగో చావేజ్ నాయకత్వాన వెనిజులాలోనూ ఇతర లాటిన్ అమెరికా దేశాలలోనూ ప్రగతిశీల ప్రభుత్వాలు ఏర్పడటానికి క్యాస్ట్రో అండగా నిలిచారు. చావేజ్కు క్యాన్సర్ వచ్చినప్పుడు క్యూబాలోనే చికిత్స పొందారు.

అమెరికా ఖండంలో తొలి విప్లవం

అమెరికా ఖండంలో తొలిసారిగా ఆ దేశానికి అతి సమీపంలో విప్లవ సాధనకు నాయకత్వం వహించిన వ్యక్తి ఫిడెల్ క్యాస్ట్రో. అంతేగాక మిగిలిన చాలా సోషలిస్టు దేశాలలో ఎదురుదెబ్బలు తగిలినా అచంచలంగా కొనసాగుతున్న దేశం అది. 1961 నుంచి ఆంక్షలతో వేధించిన అమెరికా... తమ అధ్యక్షుడు బరాక్ ఒబామానే చివరకు సందర్శించాల్సి వచ్చింది. 'ఫైడల్ కాస్ట్రో రజ్' ఈ పేరు వినగానే అమెరికన్ సామ్రాజ్యవాదం ఉలిక్కిపడక తప్పదు. ప్రపంచ అగ్రనేతగా చలామణీ అవుతున్న అమెరికాకు కేవలం 150 కిలోమీటర్ల దూరంలో ఉండే క్యూబాకు కమ్యూనిస్టు విప్లవ నాయకుడిగా, దేశాధినేతగా 49 సంవత్సరాలు పరిపాలించారు. 2008లో తన బాధ్యతలను సహ పోరాట యోధుడైన తన తమ్ముడు రావుల్ కాస్ట్రోకు అప్పగించి, తాను నవంబరు 25, 2016 శుక్రవారం మరణించే వరకూ విప్లవ సాంప్రదాయాన్ని కొనసాగించారు.

అసాధారణ విజయాలు

సంపద పంపిణీలో సమానత్వం, సామాజిక న్యాయాన్ని కాపాడటం, వెనుకబడిన ప్రజానీకానికి, సామాజిక భద్రతా వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. తద్వారా పరిమితమైన వనరులతో సైతం లాటిన్ అమెరికా, తృతీయ ప్రపంచపు

సమసమాజాన్ని సృష్టించారు. విద్య, ఆరోగ్య, వైజ్ఞానిక, సాంస్కృతిక రంగాలతో పాటు క్రీడల్లోనూ క్యూబా అసాధారణ శక్తిగా అవతరించింది. సామాజిక రక్షణ వ్యవస్థలో క్యూబా ఏకగ్రీవంగా గుర్తింపు పొందింది. అందుకు ఈ గణాంకాలే తార్కాణం. విద్యకు సంబంధించి లాటిన్ అమెరికాలో నిరక్షరాస్యతా శాతం11.7 శాతంగా ఉండగా, క్యూబాలో ఇది 0.2 శాతం మాత్రమే. లాటిన్ అమెరికాలో ప్రాథమిక విద్య (11 ఏళ్ల వరకు)లో ప్రవేశాల రేటు 92 శాతం కాగా, క్యూబా ద్వీప సమూహంలో 100 శాతం నమోదవుతోంది. లాటిన్ అమెరికాలో మాధ్యమిక విద్య (14 ఏళ్లలోపు)లో ప్రవేశాల రేటు 52 శాతంగా ఉండగా, క్యూబాలో 99.7 శాతంగా ఉంది. లాటిన్ అమెరికాలో పాఠశాల స్థాయికి చేరుకుంటున్న పిల్లలు 76 శాతం కాగా, క్యూబాలో 100 శాతం విద్యార్థులు ఈ స్థాయికి చేరుకుంటున్నారు. వర్ధమాన దేశాలన్నింటిలోకెల్లా క్యూబా గణాంకాలు అపూర్వమైనవని ఐరోపా యూనియన్‌కు చెందిన ఆర్థిక, సామాజిక మండలి గుర్తించింది.



విద్యారంగంలో మేటి

పాఠశాల విద్యలో అత్యధిక రేటుతో, నిరక్షరాస్యతలో అతి స్వల్ప రేటుతో లాటిన్ అమెరికా ఖండంలోనే క్యూబా ముందుందని యునెస్కోకు చెందిన విద్యా విభాగం వెల్లడించింది. లాటిన్ అమెరికా విద్యార్థులతో పోలిస్తే క్యూబా విద్యార్థుల మేథస్సు రెండు రెట్లు అధికంగా ఉంది. క్యూబా అన్ని విషయాల కంటే విద్యకే పెద్దపీట వేస్తోంది. అందుకే లాటిన్ అమెరికాలోని దేశాల్లో క్యూబా పేద దేశమైనప్పటికీ ప్రాథమిక విద్యలో మాత్రం అత్యున్నత గుర్తింపును సొంతం చేసుకోగలిగింది. విద్యాభివృద్ధి సూచిక(ఐడిఈ)లో లాటిన్ అమెరికా దేశాలన్నిటినీ వెనక్కి నెట్టి క్యూబా16వ స్థానాన్ని కైవసం చేసుకుందని యునెస్కో వెల్లడించింది. ప్రపంచ ప్రాథమిక విద్య, వయోజన అక్షరాస్యత, లింగ వివక్ష, స్త్రీ పురుష సమానత్వం, నాణ్యమైన విద్య, తదితర అంశాలను మదింపు చేసేందుకు ప్రామాణికమైన ఐడిఈ సూచిక ప్రకారం యునెస్కో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. అయితే ఈ సూచికలో అగ్రరాజ్యం అమెరికా 25వ స్థానంలో ఉండటం గమనార్హం! అందరికీ విద్యనందించడం కోసం క్యూబా తన బడ్జెట్‌లో అధిక మొత్తాన్ని కేటాయిస్తుందనీ, ఇది జిడిపిలో దాదాపు 13 శాతం ఉంటుందని యునెస్కో తెలిపింది. అమెరికా జిడిపిలో విద్యకు కేటాయిస్తున్నది 7.3 శాతం కాగా, స్వీడన్6.7 శాతం, ఫిన్‌ల్యాండ్ 6.4 శాతం, ఫ్రాన్స్ 6.3 శాతం, నెదర్లాండ్స్ 6.2, బ్రిటన్,ఆస్ట్రేలియా దేశాలు 6 శాతం, స్పెయిన్ 5.6 శాతం, జర్మనీ 5.3 శాతం, జపాన్ 5.2శాతం, ఇటలీ 4.9 శాతం తమ జిడిపిలో విద్యకు కేటాయిస్తున్నాయి.

వైద్యంలో తిరుగులేని శక్తి

ఇక క్యూబా ఆరోగ్య వ్యవస్థ నైపుణ్యాన్ని కళ్లకు కట్టే మరికొన్ని గణాంకాల విషయానికొద్దాం. లాటిన్ అమెరికాలో వెయ్యికి 34 మంది శిశువులు మృత్యువాత పడుతుండగా, క్యూబాలో వెయ్యికి 4.6 మంది శిశువులు మరణిస్తున్నారు. లాటిన్ అమెరికాలో కెనడా నుంచి అర్జెంటీనా వరకు అన్ని దేశాల్లో కంటే క్యూబాలో శిశు మరణాల సంఖ్య అతిస్వల్పం. ఖండం మొత్తం మీద ప్రజల ఆయుర్దాయం 70సంవత్సరాలుండగా, క్యూబా ప్రజల ఆయుర్దాయం 78 సంవత్సరాలు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం వందేళ్లకు పైగా బ్రతికిన వారి సంఖ్య ఎక్కువగా గల దేశాల సరసన కూడా క్యూబా నిలిచింది. లాటిన్ అమెరికాలో లక్షమంది ప్రజానీకానికి 160 మంది డాక్టర్లుండగా, క్యూబాలో 590 మంది డాక్టర్లు ఉన్నారు. తలసరిన అత్యధిక వైద్యులున్న దేశంగా సైతం క్యూబా ప్రపంచ దేశాల కంటే ముందుంది. ప్రపంచంలోనే అత్యధిక ప్రాచుర్యం పొందిన వైద్యశాస్త్ర పత్రిక 'న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్' (ఎన్ఇజెఎం) సైతం క్యూబాపై ప్రశంసల వర్షం కురిపించింది. "క్యూబా ఆరోగ్య వ్యవస్థ నైపుణ్యం నమ్మశక్యం కాని విధంగా ఉంది. అక్కడ లెక్కకు మిక్కిలిగా వైద్యులు ఉన్నారు. ప్రతి ఒక్కరికీ ఒక కుటుంబ వైద్యుడు అందుబాటు లో ఉన్నారు. వైద్యమంతా పూర్తిగా ఉచితంగా అందుతోంది. పరిమిత వనరులున్నప్పటికీ ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో మన కంటే(అమెరికా కంటే) క్యూబానే సమర్థవంతంగా ఉంది. తలసరిన అమెరికా కంటే రెట్టింపు సంఖ్యలో డాక్టర్లు క్యూబాలో ఉన్నారు" అని ఆ పత్రిక వ్యాఖ్యానించింది.

యువతరాన్ని ఉర్రూతలూపిన జంట

ఈ జంటస్నేహం ప్రపంచ యువతరాన్ని ఉర్రూతలూపింది. మన పవన్ కల్యాణ్ నుండి, ఫుట్‌బాల్ మాంత్రికుడు మారడోనా వరకూ చే గువేరా ఓ ఐకాన్. ఈ స్నేహితులను చూస్తే మనదేశ స్వాతంత్ర్య సమరయోధులు జంట భగత్‌సింగ్, శివవర్మ లు గుర్తుకొస్తారు. భగత్ సింగ్ ఉరిశిక్ష పడిన సందర్భంలో తనను కలసిన సహచరుడైన శివవర్మతో ఇలా అంటాడు. "నేను వెళ్ళి పోతున్నాను. ఈ భవనాన్ని మీ భుజస్కంధాలపై మోయాల్సి ఉంటుంది" అని అన్న మాటలు మనకు గుర్తుకు వస్తాయి. చేగువేరా 39 ఏళ్ళకే ఆశయసాధనలో అమరుడైతే, ఫైడల్ కాస్ట్రో 90 ఏళ్ళు జీవించి ఆశయాన్ని అమలు జరిపి ప్రపంచానికొక మార్గం చూపారు. అరుదైన ఈ స్నేహం అజరామరం.

సామాజిక భద్రతలో మేటి

అతి తక్కువ నిరుద్యోగ రేటు (1.9 శాతం) తోనూ, ఉద్యోగులకు రక్షణ కల్పించడంలోనూ క్యూబా సామాజిక భద్రతా వ్యవస్థ ఓ అద్భుతమని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఒ) కొనియాడింది. ఐఎల్ఒ లెక్కల ప్రకారం లాటిన్ అమెరికాలో11 శాతం ప్రజలకు ఉపాధి కల్పన లేదు, దాదాపు 65 శాతానికి పైగా ప్రజలు సాంఘిక భద్రతకు దూరంగా ఉన్నారు. ఓ వైపు 2.5 కోట్ల మంది పిల్లలు వెట్టిచాకిరీ చేస్తుండగా, మరోవైపు 1.95 కోట్ల మంది పెద్దలు నిరుద్యోగులుగా కాలం వెళ్లదీస్తున్నారు. లాటిన్ అమెరికాలో నెలకొని ఉన్న గొప్ప వైరుధ్యాల్లో ఇది ఒకటి. అమెరికా ఆర్థిక ఆంక్షలు, అత్యంత పరిమితమైన వనరులు ఉన్నప్పటికీ ధనిక దేశాలకు ధీటుగా ప్రజలకు సామాజిక భద్రతను అందించడం సాధ్యమేనని ఫైడల్ కాస్ట్రో నిరూపించారు. తద్వారా ఒక నూతన సామాజిక వ్యవస్థను తమ దేశ ప్రజలకు అందించారు.

కాలు కదపని యాత్రికురాలు

మార్కెట్‌కెళ్లి రావడానికే జాక్వీ కెన్నీకి భయం. ఇక ప్రపంచాన్ని చూడాలన్న తన కల ఎలా నెరవేరుతుంది. లండన్‌కు చెందిన జాక్వీకి జనసమ్మర్ద ప్రాంతాలన్నా, కొత్త ప్రదేశాలన్నా చాలా భయం. దీన్నే అగారోఫోబియాగా పిలుస్తారు. ఇది జాక్వీకి మరీ ఎక్కువ. 20 ఏళ్ల నుంచి ఈ సమస్యతో బాధపడుతోంది. ఇల్లు కదలడానికి కడుపు కాలేంత ఆకలేయాలి. అప్పుడే మార్కెట్. అది కూడా ఇలా వెళ్లి వచ్చేయాలి. మరి ఆమె ప్రపంచాన్ని ఎలా చూసిందంటే గూగుల్ స్ట్రీట్ వ్యూ మ్యాప్‌ల ద్వారా. రోజూ గంటల తరబడి వాటిని చూస్తుండేది. అలా చాలావరకు దేశాల్ని, కొత్త ప్రాంతాల్లో తిరుగుతున్న అనుభూతి పొందేది. ఇది ఆమెకు ఓ వ్యసనంగా మారిపోయింది. కొన్ని లక్షల చిత్రాలను చూసి వాటిల్లోంచి 26 వేలకు ఫొటోలను భద్రంగా దాచుకుందంటే ఆమె ఏ స్థాయిలో చుట్టేసిందో అర్థం చేసుకోండి. ఆమె చూపు పర్యాటక ప్రాంతాల కన్నా జనసమ్మర్దం అంతగా కనిపించని మారుమూల ప్రాంతాల్ని అందులోను బీడుపడిన ప్రదేశాల్ని చూడటం ఇష్టం.

కొసమెరుపేంటంటే... వీటిలో బాగా నచ్చిన వాటిని నేరుగా చూడాలని చాలాసార్లే ధైర్యం తెచ్చుకుంది కానీ వీలుపడలేదు. భయంతో ఇంటి తలుపు తీసి బయటకు అడుగు పెట్టలేకపోయింది. ఆమె సహోదరి పెళ్లి న్యూజిల్యాండ్‌లో జరగ్గా దానికి హాజరయ్యేందుకు నాలుగు నెలల నుంచి మానసికంగా సిద్ధం చేసుకుంది. మానసికవేత్తల సేవలు తీసుకుందంటే నమ్మలేం. నెట్‌లోనే యాత్ర చేసేస్తున్న ఈమె ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సేకరించిన ఫొటోల్ని 'అగారోఫోబిక్ ట్రావెలర్' పేరుతో మిగతావారితో పంచుకుంటోంది.

ఈతకు ట్రాఫిక్ లేదు

ఇంటికి దగ్గరలోనే ఆఫీసు అని సంబరపడ్డాడు కానీ బెంజమిన్ డేవిడ్‌కు ఓ చిక్కు వచ్చిపడింది. చిక్కుల్లాంటి దారుల గుండా ట్రాఫిక్ జామ్‌ల్లో ఇరుక్కుని ఆఫీసుకి చేరుకునే సరికి ఓపికంతా అయిపోయేది. నడుద్దామంటే అనేక ట్రాఫిక్ రూల్స్. పక్కనే నది. అది దాటితే రెండే కి.మీ.లు దూరం. అప్పుడే ఓ ఆలోచన వెలిగింది. రోజూ ఈత కొట్టుకుంటూ ఆఫీసుకి వెళ్లడం మొదలెట్టాడీ జర్మన్. తనుండే మ్యునిచ్‌లోని బాల్డేప్లాట్జ్ ప్రాంతం నుంచి కుల్టుర్‌స్ట్రాండ్‌ను ఇసార్ నది వేరుచేస్తుంది. దుస్తులు తడవకుండా ఉండేందుకు 'వికెలోఫిష్' అనే బ్యాగ్‌ను వాడతాడులెండి. స్విట్జర్లాండ్‌లో ఈత కొట్టుకుంటూ ఆఫీసులకు వెళ్లడం ఓ ట్రెండ్ అయిందంటే దానికిదే కారణం. ఆ విషయం తెలిసి మనోడు జర్మనీలో వాడేశాడు. క్యాబ్‌ల ఖర్చూ తగ్గుతోంది. ఆరోగ్యమూ పెరుగుతోందని మురిసిపోయే బెంజమిన్ నదిలోంచి బయటకు రాగానే ఓ కప్పుచినో హాయిగా తాగేసి ఫ్రెష్‌గా ఆఫీసులో అడుగు పెడతాడు.





వింత లోకం

అందరి చిరునామా

మనకు పదేపదే రాంగ్ కాల్స్ వచ్చి సతాయిస్తుంటే కోపం నషాళానికి అంటుతుంది. ఈసారి ఆ నెంబరే ఎత్తకుండా ఉంటే సరి. కానీ మనింటి చిరునామాకు కుప్పలు తెప్పలుగా రాంగ్ లెటర్స్ వచ్చి పడుతుంటే... అందులోను మీ సంతకం కచ్చితంగా తీసుకుని ఇచ్చేవో... పార్సిల్‌కు డబ్బు కట్టాల్సిన అవసరమోలాంటివే అయితే ఇక ఇల్లు ఖాళీ చేయాల్సిందే. సరిగ్గా ఇదే సమస్యతో నెదర్‌ల్యాండ్స్‌లోని ఓ ఇంటివారు గగ్గోలుపెడుతున్నారు. బద్ధకం వల్లో, కావాలనో, తమ ఉనికి తెలీకూడదనో ఏదో ఒక చిరునామాతో దరఖాస్తులు నింపేయడం వల్ల ఈ సమస్య వచ్చిపడింది. ఈ ఇంటి చిరునామా చాలా తేలిగ్గా 1234 ఎబి (మొదటి మూడు అంకెలు మార్చి)తో ఉండటమే ఇలా వందలాది ఉత్తరాలు తమకు సంబంధం లేనివారివి అందుకోవడానికి కారణం. నూర్ద్ హాలెండ్ ప్రావిన్స్‌లో ఈ చిరునామాతో ఇల్లుంది. ఇలాంటిది ఉండి ఉండదులే అని అందరూ అడ్రస్ ఇస్తుంటారేమో కానీ ఈ ఫ్యాన్సీ అడ్రెస్సే



ఇంటివారికి తలనొప్పులు తెచ్చింది. 2009లో ఎవరో నకిలీగా తమింటి చిరునామా ఇవ్వడంతో ఫోన్, ఇంటర్నెట్, విద్యుత్తు, గ్యాస్ సరఫరా ఆగిపోయిందట. కొత్తింటికి మారేపుడు పాత కనెక్షన్లను రద్దు చేసుకోవాలి. అలా చాలామంది తమ పాత చిరునామాగా ఆ ఇంటి అడ్రెస్సే ఇవ్వడంతో ఇలా జరిగింది. ఆన్‌లైన్‌లో చాలామంది ఇదే అడ్రెస్ పెట్టడంతో చాలా ఆన్‌లైన్ కంపెనీలు ఈ ఇంటికి వస్తువుల అమ్మకాలు నిలిపివేశాయి. చివరకు ఆర్నాల్డ్ ష్వాజినెగ్గర్ వంటి ప్రముఖుల పేర్ల మీద కూడా ఇదే చిరునామాకు ఉత్తరాలు వచ్చి డబ్బా అంత నిండిపోవడం వాటిలో తమకు నిజంగా వచ్చినవేంటో చూసుకోవడం దినచర్యల్లో ఒకటి అయిపోయింది. పోలీసులు, అధికారుల్ని కలిస్తే చేతులు ఎత్తేశారు. ఎందుకంటే అక్కడ తపాలా శాఖ ప్రైవేటైజ్ అయిపోయింది. ఇంటి చిరునామా మార్చాలంటే ప్రైవేట్ కంపెనీనే సంప్రదించాలి. వాళ్లేమో సరిగ్గా స్పందించలేదు. చివరకు ఊరి మేయర్ జోక్యం చేసుకుని ఎలాగొలా ఇంటి గోల తగ్గించాడు. చిత్రం ఏమిటంటే మళ్లీ ఈ మధ్యే గ్యాస్ కనెక్షన్ పోయింది. కారణం చాలా సేవల డేటాబేస్‌ల్లో ఇంకా కొత్త చిరునామా అప్‌డేట్ కాకపోవడం.

తెలుసా

ఓ మూలవాసీ..!

ఆహారం కోసం సముద్రంలో డైవ్ చేసే మోకెన్ జాతి పిల్లల కంటి చూపు యూరోపియన్ చిన్నారుల కంటే 50 శాతం ఎక్కువ.

- భూ ప్రపంచంలో మాట్లాడే ప్రతి ఆరు భాషల్లో ఒకటి న్యూ గునియా నుండి వచ్చిందనేని ఒక అంచనా.
- పాఠశాలల్లో చేరే పిల్లల్లో మూలవాసుల పిల్లల శాతం ప్రపంచవ్యాప్తంగా తక్కువే.
- ప్రపంచ జనాభాలో మూలవాసుల సంఖ్య 5 శాతం.
- ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం కెనడా మూలవాసుల యువత ఎక్కువగా ఆత్మహత్యలకి పాల్పడుతున్నారు.
- అమెజాన్ నదీపరీవాహక ప్రాంతాల్లో ప్రపంచానికి ఎక్కువగా తెలిసింది ఏడు శాతం మాత్రమే.

- ప్రపంచవ్యాప్తంగా 70 దేశాలోని దాదాపు 37 కోట్ల మంది మూలవాసులుగా గుర్తించబడ్డారు.
- ప్రపంచవ్యాప్తంగా 5000లకు పైగా తెగలు గుర్తించబడ్డాయి.
- సర్వైవల్ ఇంటర్నేషనల్ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికీ బయటి ప్రపంచానికి పరిచయం లేని తెగలు వందకు పైనే. మాచ్చూపిచు ప్రాంతానికి వంద కిలో మీటర్ల దూరంలో ఇప్పటికీ కొన్ని తెగలు వున్నాయనేది ఒక అంచనా.
- అండమాన్ దీవుల్లో సంచార జీవనం చేసే మొకెన్ జాతికి సీ జిప్సీ' అనే పేరుంది.

- దాదాపు 400 దేశీయ సమూహాలకి కేంద్రంగా వున్న అమెజాన్ ప్రదేశం వల్ల ప్రపంచం లోకెల్లా అతిపెద్ద మూలవాసుల స్థానికతని కలిగిన ప్రాంతంగా గుర్తించ బడింది.
- ప్రపంచ వ్యాప్తంగా వాడుకలో వున్న దాదాపు 6700 భాషల్లో 4000 మూలవాసులవే.
- ప్రస్తుతం ఆధిపత్య భాషల ద్వారా ఇవి కనుమరుగవుతున్నాయనేది ఒక నివేదిక.
- వారి హక్కులు పరిరక్షించేందుకు మూలవాసుల అంతర్జాతీయ దినోత్సవాన్ని ఆగస్టు 9న నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి నిర్ణయించింది.



- బొలీవియాకి చెందిన తెగ కల్లవెయ హిలర్స్ వాడుక భాష ఒకప్పుడు ఇన్కా రాజుల రహస్య భాషగా వుందనేది చరిత్రకారుల అభిప్రాయం.
- సెంటెన్నెలిస్ తెగ అండమాన్ దీవుల్లో 55 వేల సంవత్సరాలు నివాసం కొనసాగించిన ఒకప్పటి తెగ.

- వరి, బంగాళా దుంపలు ప్రపంచవ్యాప్తంగా మూలవాసి తెగల ప్రధాన ఆహారంగా వుండేవి.
- 2004లో సునామీ వచ్చినపుడు చాలా ప్రాంతాల్లో జన నష్టం తీవ్రంగా ఉంటే మోకెన్ ఆస్ట్రొనేసియన్ తెగ వారే ప్రాణాలతో బయటపడ్డారు. వీరికి సునామీ రాకడ గురించి ముందే తెలిసిందని దాన్నుంచి తప్పించుకునేందుకు సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారనే విషయాలు విస్మయానికి గురిచేశాయి. ఆధునిక మనిషి కూడా అంచనా వేయలేని సునామీ అనే వైపరీత్యం గురించి వారికెలా తెలిసిందో అంతుబట్టలేదు చాలామంది పరిశోధకులకు.

ప్రేక్షకులకి పది కాలాలు గుర్తుండిపోయే చిత్రాలందించే సంస్థల్లో బాబూ మూవీస్ ఒకటి. ఇదో ప్రతిష్ఠాత్మక సంస్థ. ఈ సంస్థ అధినేత పేరుకి జి.సుందరం అయినా అన్నీ తానై నడిపించిన వ్యక్తి ఆదుర్తి సుబ్బారావు. ఒక్కమాటలో చెప్పాలంటే భిన్నమైన తెలుగు కుటుంబ కథా చిత్రాలకు రంగు, రూపం, రుచి మార్చిన వ్యక్తి ఆదుర్తి సుబ్బారావు గారు. సెల్యూలాయిడ్ మీద మన కథలు.. ఇలాగే ఉంటాయి అనేలా సన్నివేశాలని చిత్రీకరించేవారు. అటువంటి సహజసిద్ధమైన ఒక మంచి మనసున్న సినిమా 'మంచి మనసులు'.

ఆదుర్తి ఎమోషనల్ -భావోద్వేగాల్ని దాచుకోలేని వ్యక్తి. ఆత్రేయ గారిదీ అదే పరిస్థితి ముక్కసూటి తానం. ఇష్టముంటే పనిచెయ్యడం. ఇష్టం లేకపోతే చెప్పాపెట్టకుండా వెళ్ళిపోవడం.. ఇలా భిన్న మనస్తత్వాలున్న ఇద్దరి మధ్య భిన్నత్వంలోంచి ఏకత్వం కుదిరింది. ఒక లైను అనుకున్నారు. డెవలప్ చేశారు. అందరివీ మంచి మనసులే. ట్రీట్‌మెంట్ కూడా రాసుకోవడం జరిగింది. మధ్యతరగతి మనస్తత్వాలకి అద్దం పట్టే సన్నివేశాలు కుదిరాయి. సంపన్న కుటుంబాలూ, మధ్యతరగతి మనస్తత్వాల మేలుకలయిక మంచి మనసులు చిత్రం.

నటీనటులూ, షూటింగ్ షెడ్యూలు

ఆత్రేయగారికి బాగా నచ్చిన చిత్రం ఇది. ఇప్పటిలా స్క్రిప్ట్ హ్యాండోవర్ చేసి మరిక కనిపించక పోవడం అప్పుడు లేదు. షూటింగ్ మొదలయినప్పటి నుండి పూర్తయ్యే వరకూ స్క్రిప్ట్ రైటర్ ఆర్టిస్టులకూ డైరెక్టరుకీ అందుబాటులో ఉండాలి. ఆత్రేయ దాదాపు అలాగే ఉన్నారు. అదీ వారిద్దరి మధ్య ఉన్న అనుబంధం! ఈ సినిమాలో నటించిన హీరో హీరోయిన్లది బిజీ షెడ్యూల్. ప్రధానపాత్రలు యస్.వి. రంగారావు, సూర్యాకాంతం బిజీ. అలాగే తండ్రి కూతుళ్లు పాత్రలు చేసిన గుమ్మడి, వాసంతి కూడా. ఈ చిత్రంలో మరో కథా నాయిక జానకి, నాగభూషణం అందుబాటులో ఉన్నారు. మెజార్టీ పార్టు షూటింగ్ జరిగింది. ఒక్క 'అహో ఆంధ్రభోజా...' పాట కోసం మాత్రం హంపి వెళ్లడం జరిగింది. అందువల్ల నటీనటులు ఎవరు అందుబాటులో వుంటే వారితో షూటింగ్ చేసేసేవారు. ముఖ్యంగా ఆదుర్తి సుబ్బారావు ఎడిటరు గనుక ఎంతవరకు అవసరమో అంతవరకే చిత్రీకరించేవారు. ఆయన ప్లానింగ్‌కి అనుకూలంగా షెడ్యూల్ వేసుకొనేవారు. రోజుల తరబడి సెట్‌లో పడిగాపులు కాయకుండా ఆడుతూ పాడుతూ షూటింగు పూర్తిచేసి పంపించేవారు. నటీనటుల సమయం వృధా చేసేవారు కాదు. ఆదుర్తి ఎప్పుడైనా ఓ గంటా రెండుగంటలు అవసరం పడుతుంది అంటూ రిక్వెస్ట్ చేస్తే కాదనేవారు కాదు. షూటింగు ఆడుతూ పాడుతూ సాగిపోయింది.

కథ-కమామిషూ

1962లో వచ్చిన సినిమా 'మంచిమనసులు'. అప్పటికి ఉమ్మడి కుటుంబాలే ప్రధానంగా వుండేవి. తండ్రి లేకపోతే అన్నయ్య తండ్రిలా కష్టపడి తమ్ముడ్ని చదివించేవాడు. తమ్ముడు జీవితాంతం అయ్యాకే.. అన్నయ్య కుటుంబానికి అంకితభావంతో వుండేవాడు. సహజంగా వాడుకలో వున్న వ్యవహారం. దీనికి ఆదుర్తి ఆత్రేయలు ఎంత గొప్ప ట్రీట్‌మెంట్ ఇచ్చారంటే పేదరికంలో పుట్టిన వారికి సంపన్నకుటుంబంలో పుట్టినవారికి మధ్య వ్యత్యాసాలుండవనీ మంచిమనసు అనేది అందరికీ కామనే... అని చూపించడం విశేషం! గుమ్మడి (అన్నయ్య) అతికష్టం మీద కమ్మరి పనిచేస్తూ అక్కినేని (తమ్ముడ్ని) చదివిస్తుంటాడు. చదువు పూర్తయితే తమ కష్టాలు పూర్తవుతాయని కూతురు వాసంతికి మంచి సంబంధం చూసి పెళ్ళి చేస్తాడని ఆశపడతాడు గుమ్మడి. పేదరికంలో వున్న అన్నను కష్టపెట్టడం ఇష్టంలేని అక్కినేని పట్నంలో ఏదైనా చిన్న ఇంట్లో అద్దెకు వుంటూ తక్కువ ఖర్చులో డిగ్రీ పూర్తిచేయాలనుకుంటాడు. ఆ సమయంలో తనకి ఆనందరావు (యస్వీఆర్) ఎదురవుతాడు. వృత్తిరీత్యా లాయరు. ఆయన కూతురు శాంతి(సావిత్రి), భార్య కాంతం (సూర్యకాంతం). వేణు (అక్కినేని)కి పెళ్ళికాలేదని తెలిస్తే ఇంట్లో భార్య చోటివ్వదని పెళ్ళయినట్టు అబద్ధం చెప్పమంటాడు. శాంతి(సావిత్రి) వేణుకి పెళ్ళి కాలేదని తెలిసి ఆటపట్టిస్తుంది. శాంతి వేణులు క్రమంగా ప్రేమలో పడతారు.

వేణు అన్నయ్యని చూడ్డానికి వెళ్ళినప్పుడు అన్నయ్య కూతురు శాంతి(వాసంతి) నాగభూషణం అనే యువకుడితో ప్రేమలో పడినట్లు తెలుసుకుంటాడు. నాగభూషణం అతని తల్లిదండ్రులు స్వార్థపరులు. తమ కూతురు షావుకారు జానకిని పెళ్ళి చేసుకుంటే... వాసంతిని నాగభూషణం పెళ్ళిచేసుకుంటాడని కండిషన్ పెడతారు. తన గురించి సర్వస్వం త్యాగం చేసిన అన్నయ్య కోసం ఈ షరతుకి ఒప్పుకుంటాడు జరిగింది శాంతితో చెప్పి మన్నించమంటాడు. యస్వీఆర్, సావిత్రి పెద్దమనసుతో అర్థం చేసుకుంటారు. సావిత్రి 'లా' చదువు పూర్తిచేసి ప్రాక్టీసులో పడుతుంది. వాసంతి అత్తవారింటికి వెళ్ళి అష్టకష్టాలు పడుతుంది. నాగభూషణం తాగుబోతు, తిరగుబోతు. అత్తవారి ఆరళ్ళు ... మొదలవుతాయి. జానకిని పెళ్ళి చేసుకున్న వేణు అనుక్షణం సావిత్రి జ్ఞాపకాలతో సతమతమవుతుంటాడు. ఆమెను ప్రేమగా చూడలేకపోతాడు. ఒకసారి కొత్త దంపతుల్ని చూడ్డానికి వచ్చిన సావిత్రి వారి మధ్య అడ్డుగోడల్ని తొలిగించి ఆనందంగా కాపురం చేసుకొనేలా నచ్చబెబుతుంది. ఓ సారి వేణు (అక్కినేని) తన భార్యని హంపి తీసుకెళతాడు. హంపి వైభవం గురించి జానకికి చెబుతాడు. అదే సమయంలో నాగభూషణం పాత ప్రేమికురాలు సూర్యకళ అక్కడుంటారు. తనను మోసం చేసినందుకు ఆమె నాగభూషణాన్ని నిలదీస్తుంది. నాగభూషణం ఆమెను హత్య చేస్తాడు. అది అక్కినేని చూస్తాడు. నాగభూషణంకి శిక్ష పడితే.. తన అన్న కూతురు వాసంతికి వైధవ్యం వస్తుందని ఆ నేరాన్ని తన మీద వేసుకుంటాడు. ఈ విషయం

తెలిసి శాంతి(సావిత్రి) · వేణు నిర్దోషి అని వాదిస్తుంది. ఆమె తండ్రి ఆనందరావు(యస్వీఆర్) వేణు హంతకుడని వాదిస్తాడు. చివరకు వాసంతి సహాయంతో జానకి నాగభూషణం దోషిగా గుర్తుపడుతుంది. వాసంతి రుజువులు చూపిస్తుంది. నాగభూషణానికి శిక్ష పడుతుంది. నాగభూషణం పశ్చాత్తాపంతో జైలుకు వెళతాడు. ఇంతమంది మంచి మనుషుల మధ్య మనగలిగే అర్హత లేదంటూ.. తన భార్య వాసంతిని వేణు, జానకిలకి అప్పగిస్తాడు. ఇదీ కథాంశం.!

ఈ కథలో వున్న గొప్పతనం ఏంటంటే సినిమా మొదలైనప్పట్నుంచీ శుభం కార్డు పడేవరకూ సింగిల్ ఫ్రేమ్ కూడా బోరుకొట్టదు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది.

మామగా మార్చిన చిత్రం

మంచి మనసులు చిత్రానికి తేనెలాంటి పాటల్ని అందించాడు కె.వి మహదేవన్. ఆత్రేయ, ఆదుర్తి సుబ్బారావులు మంచి స్నేహితులు. ఆత్రేయ లేకుండా అద్భుత పాటని ఊహించుకోలేరు. అలాంటిది ఈ సినిమాలో మాత్రం పాటలన్నింటినీ సందర్భశుద్ధితో రాయించుకున్నారు. మొదటి పాట 'ఎంత టక్కరివాడు నారాజు ఏమూలనో నక్కినాడు...' కొసరాజు రాశారు. వాసంతి మీద చిత్రీకరించారు. రెండవది అక్కినేనిని టీజ్ చేస్తూ సాగినపాట 'ఏమండోయ్ శ్రీవారు ఒక చిన్న మాట... ఏ వూరూ వెడతారూ...' మూడవది. 'మావ మావా మావా... పట్టుకుంటే కందిపోవు పండువంటి

చిన్నదుంటే చుట్టు చుట్టూ తిరుగుతావు మరియాదా....తాళి కట్టకుండా ముట్టుకుంటే తప్పుకాదా' అంటూ సాగిన ఈ పాటని కొసరాజు రసరమ్యంగా రాశాడు. ఈ పాటకి స్వరం మహదేవన్ చేశాడు. ఈ పాట ఎంత పెద్ద హిట్టో చెప్పనక్కర్లేదు. ఈ పాట అప్పట్లో చెన్నపట్నంలో మార్మోగిపోయింది. ఈ పాట ప్రభావంతో మహదేవన్ పేరు 'మామ'గా మిగిలిపోయింది. కె.వి మహదేవన్ బతికినంత కాలం 'మామ'గానే మిగిలిపోయాడు. అక్కినేని జానకిల మధ్య సామరస్యం కోసం అర్థం చేసుకోవడం కోసం సావిత్రి అక్కినేనికి కనువిప్పు కలిగించిన పాట 'త్యాగం ఇదియేనా హృదయం శిలయేనా? అంటూ సాగుతుంది. ఈ పాట శ్రీశ్రీ రాశారు. 'ఓహో ఓహో పావురమా...!' భర్తని ఊహించుకొంటూ జానకి మీద చిత్రీకరించిన పాట ఆత్రేయ రాశారు. హంపి అందాలు చూపించినపుడు 'అహో ఆంధ్రభోజా..శ్రీకృష్ణదేవరాయా విజయనగర సామ్రాజ్య నిర్మాణ తేజోవిరాజా...' ఈ పాట సాకీ మొదలయినపుడే థియేటర్లో చప్పట్ల వర్షం మారుమ్రోగుతుంది. కరణం పాటలో గాంభీర్యం ఒక ఎత్తైతే.. శ్రీకృష్ణదేవరాయలుగా యన్టీరామారావు కనిపించడం మరో ఎత్తు. భలే థ్రిల్లింగా సాగుతుందీ పాట. హంపి అందాలు తొలిసారిగా తెలుగు ప్రేక్షకులు చూపించిన ఈ పాట ఆత్రేయ రాశారు. 'నన్ను వదిలి నీవు పోలేవులే అదీ నిజములే... పూవులేని తావి విలువ లేదులే...' మధురమైన పాట ఆత్రేయ రాసిందే. ఈ పాటని ఘంటసాల సుశీల పాడారు. ముఖ్యంగా ఈ పాటలో సావిత్రి, అక్కినేని అభినయం మధురంగా సాగింది. ఆదుర్తి చిత్రీకరించిన విధానం మరిచిపోలేనిది. ఇప్పటికీ కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. సినిమా విజయంలో సింహభాగం ముగ్గురికే చెందుతుంది. అక్కినేని, సావిత్రి, యస్వీఆర్. ముఖ్యంగా ప్రథమార్ధంలో తీయగా సరదాగా సాగిన చిత్రం షావుకారు జానకిని పెళ్లి చేసుకోవడంతో ఆసక్తికరమైన మలుపు తిరుగుతుంది. సావిత్రి మళ్ళీ అక్కినేని, జానకి కాపురం చక్కదిద్దడం... తనకు తనే ముద్దాయిగా అంగీకరించి శిక్షకు సిద్ధమైన అక్కినేనిని తన తెలివితేటలతో తండ్రిని ఎదిరించి రక్షించుకోవడం హైలెట్‌గా నిలుస్తుంది. ముఖ్యంగా కోర్టు సన్నివేశం అత్యంత ఉత్కంఠతో అసక్తిగా సాగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే 'మంచి మనసులు' చిత్రం భాగోద్వేగాలు, మానవ సంబంధాల మేలుకలయికగా నిలుస్తుంది. ఆ రోజుల్లో సంచలన విజయం సాధించిన చిత్రం 'మంచి మనసులు'.

యస్వీఆర్, సావిత్రి పోటీపడి

ఆ రోజు కోర్టు సన్నివేశం షూటింగు జరుగుతోంది. మాటల మాంత్రికుడు ఆత్రేయగారు రచన మాటలు రాయాలి. చిత్రీకరించాలి. ముందు కావలసిన కాంబినేషన్ షాట్స్ షూట్ చేస్తున్నారు. రూమ్‌లో సావిత్రి, యస్వీఆర్ వున్నారు. ఇద్దరి మధ్య తండ్రీ కూతుళ్ల అనుబంధం వుంది. ముఖ్యంగా యస్వీఆర్ భయపడేది సావిత్రి, రమాప్రభ దగ్గరే. ఈ విషయం ఆయనే చెప్పుకున్నారు. ఎందుకంటే ఎప్పుడే రియాక్షనిస్తారో వారికే తెలియదు. ఎప్పుడే డైలాగ్ మాట్లాడిస్తారో వారికే తెలియదు. మహానటి సావిత్రి గురించి వేరే చెప్పాలా? చాలా మందికి తెలియని విషయం సావిత్రి చక్కని భావుకత కలిగిన వ్యక్తి. సందర్భ శుద్ధిననుసరించి అప్పటికప్పుడు ఒకమాట అనేస్తుంది. అదే ఫైనల్... అంతకు మించినమాట రచయితకు దొరకదు. ఈ విషయం ఆత్రేయ చెబుతుండేవారు. ఇదంతా ఎందుకు చెప్పుకోవాలంటే కోర్టు సన్నివేశంలో వాదోపవాదాలు అద్భుతంగా, ఆసక్తికరంగా వుంటాయి. ఈ మాటలు సావిత్రి, యస్వీఆర్, అప్పటికప్పుడు సన్నివేశాన్ని అనుకొని నువ్విలా అను... నేనిలా అంటాను అని రక్తి కట్టించిన తీరు అద్భుతం! షూటింగు అయిపోయింది. సింగిల్ టేక్‌లో చాలా పెద్ద సన్నివేశం అత్యద్భుతంగా వచ్చింది. ఆదుర్తి గారు పరవశించిపోయారు. ఆత్రేయని అభినందనలతో ముంచెత్తారు. ఆత్రేయ తెల్లమొహం వేశాడు. సావిత్రి తెలివితేటలకు మురిసిపోయాడు.

ఆదుర్తి మనసు

మానవ సంబంధాలూ, భావోద్వేగాల్ని పడుగుపేకల్లా అల్లుకొని అద్భుతంగా చిత్రీకరించాడు ఆదుర్తి సుబ్బారావు. ప్రతి సన్నివేశాన్ని పండించాడు. ముఖ్యంగా అక్కినేని, సావిత్రి మధ్య కెమిస్ట్రీ.. తండ్రీ కూతుళ్ల మధ్య అల్లరి అదీ ఆ రోజుల్లో కథల్లోంచి పుట్టుకొచ్చిన పాత్రలు, పాత్రల ఔచిత్యంతో పరవశించిపోయిన ప్రేక్షకులు... వెరసి మంచిమనసులు చిత్రాన్ని ఎప్పటికీ మరిచిపోలేరు.

- ఇమంది రామారావు
9010133844

కర్షకుడి కంట కన్నీరు

చూపుల తపస్సుకు కరిగిన ఆకాశం
మేఘాన్ని వొప్పించి వర్షం కురిపించింది
ఉప్పు కారం తిని నేలకు రుణపడ్డ రైతు
ఆశను నెత్తికెత్తుకుని
కారానికి మిరపను పండించి
ధరలేక ప్రభుత్వ చేయూత లేక
బతుకు నిస్సారమైంది!
ఆకుపచ్చని లోగిళ్లు పచ్చపచ్చగా పూయించటానికి
పండిన పసుపు మార్కెటు యార్డుకు రాలేక
వచ్చినా గిట్టుబాటు ధర తేలేక రగిలిన రైతు ముఖాలు
తెల్లగా పాలిపోయాయి!
ఎగరేసిన జెండాపై ఏరువాక చిత్రించి
నాటిన మొలగొలుకుల నారు
బరువెక్కిన కంకెలతో కల్లం రాశులైంది
గింజను కొనేవాడు లేక
కల్లమే రాశుల కాపురమైంది!
గడ్డ కట్టిన అప్పులు కరిగించే ఎత్తుగడలో
టొమాటో సాగుచేస్తే విరగబడ్డ దిగుబడికి
నల్లరేగడి ఎర్రగా మారింది కోత కూలి నష్టమై
పంట పశువులకు ఆహారమైంది!
అందరికీ ఆప్తమై నిత్యావసరమై
వంటింట్లో తిరుగాడే ఉల్లిపాయల సేద్యంచేస్తే
తులాభారంలో తేలికై కొయ్యకనే ఉల్లిపాయలు
రైతుకంట కన్నీరు కార్పించాయి
కర్షకుడి కంట కన్నీరు దళారి యింట పన్నీరు..!

అడిగోపుల వెంకటరత్నమ్
సెల్ : 9848252946

కవిత్వం

నీరు

ఏటిలోని గల గలలు లేవని, రావని
తడి ఆరిన గొంతుక తల్లడిల్లుతున్నది..!!
మనిషి ధరణిపై దండయాత్ర చేస్తుంటే
తల్లి మనసు తల్లడిల్లి కన్నీరు కారుస్తుంటే..!!
తల్లి కన్నీటితో దేహం
దాహం తీర్చుకుంటున్నాము
కదిలిపోయే కాలంలో
కలసిపోయే కాలంలో
కలసిపోయే నీకు..!!
తల్లి గాయాల వేదనల
రోదనలు కనిపించవా..!!
నీరించిన భ్రష్టమాతను
కాటేయకురా..!!
గంగమ్మ గల గలలు
సాగనివ్వర...!!
ఆక్రమించకు వాగు- వంకలు,
చెరువు-కుంటలు..!!
ధరణి గంగతో నిండినప్పుడే
మనిషి జీవన ప్రయాణం
కొనసాగును కదా..!!

-అఖిలాశ
07259511956



విద్యార్థి



కథ

జి.ఎల్.ఎన్ ప్రసాద్
9441450987

పచ్చటి పంట పొలాల మధ్య చిక్కటి చీకటి పాయలాగా తారు రోడ్డు.

చిత్తూరు జిల్లా భౌగోళిక స్వరూపం వల్ల ఆ రోడ్డు తిన్నగా కాకుండా పాము లాగ మెలికలు తిరిగి వుంది. ఆ తోవలో మలుపులు చూస్తుంటే జీవితంలోని మలుపులను చూసినట్టు వుంది. అలాంటి రోడ్డు మీద పల్సర్ మోటార్ సైకిల్ మీద చవటగుంటకు బయలుదేరాను. తిరుపతి నుంచి ఈ పల్లెటూరుకు బస్సులో అయితే గంటలో పోవచ్చు. మరి నేను పల్సర్ బండిలో గంటలోపే చేరుకుంటాననుకొంటా. నాకు నియామక ఉత్తర్వులు వచ్చే వరకు నేను ఆ ఊరి పేరు కూడా వినలేదు. బస్సులు తక్కువగా ఉండడం వల్ల మొదటి రోజు ఆలస్యం కాకుండా పల్సర్‌లో బయలుదేరాను. ఒక్కడ్నే ప్రయాణించడం విసుగు కదా మరి.....అందుకే ఇయర్ ఫోన్స్ పెట్టుకొని ఇళయరాజ హిట్స్ వింటూ ఈల వేసుకొంటూ బయలుదేరాను. నాకు ఎదురుగా వచ్చే అన్ని వాహనాలూ సామర్థ్యానికి మించి జనాలను ఎక్కించుకుని దూసుకొస్తున్నాయి. ఈ పల్లెటూళ్ళలో ఉన్నవారికి జీవితమంటే లెక్కలేదో.... చావంటే భయం లేదో నాకైతే అర్థం కాలేదు. మోటార్ సైకిళ్ళ మీద కూడా ముగ్గురేసి చొప్పున ప్రయాణిస్తున్నారు. జనాలను ఆటోలకు ఫెవికాల్ వేసి అంటించినట్లుగా ఉంది. ఎవ్వరూ కూడా కుదుపులకు ఊగటం నా కంట పడలేదు. నాకు మాత్రం ఆ మార్గం అలవాటు లేకపోవడం వల్ల మలుపుల వద్ద టర్న్ తీసుకోవడం ఇబ్బందిగా వుంది. అందులో నేను మొదటి నుంచి నగర వాతావరణానికి అలవాటు పడ్డాను. ఈ మలుపుల వద్ద నా పల్సర్ ఒక వైపుకు వాలి మోకాళు ్ళ చీరుకుపోతాయేమో అని భయం కలిగింది. చాలా భాగం మట్టి రోడ్డు... అక్కడక్కడా మాత్రం తారు రోడ్డు. మన దేశం పల్లె సీమలు ఎప్పుడు అభివృద్ధి చెందుతాయో కదా ...అని తెగ బాధపడుతూ వేగం పెంచాను. ఉన్నట్టుండి పక్క పొలం గట్టు మీది నుంచి రోడ్డు మీదకు పశువులు దూసుకొచ్చాయి. సడన్ బ్రేక్ వేశాను..... కింద పడేవాడిని త్రుటిలో నిలదొక్కుకున్నాను.

"అవైతే పశువులు చూసుకోవు. ..నీకేం పోయేకాలం.... చూసి బండి నడపొచ్చు కదా." చెట్టు కింద కూచున్న ఎవడో చుట్ట తాగుతున్న ఆసామి హిత బోధ చేస్తున్నాడు.

"ఏ ఊరు మనది" ఇంకొకడు ఇంటర్వ్యూ చేస్తున్నట్టు అడిగాడు.

"తిరుపతి" ముక్తసరిగా చెప్పాను.

"తెలుస్తూనే వుంది" అన్నాడు పక్కన ఉన్న ఇంకొకడు. చిత్తూరు జిల్లా వెటకారం అంతా అతడి గొంతులో ధ్వనించింది. వామ్మో ఇలాంటి ఎటకారాలను నేను ఈ పల్లెటూళ్ళలో పనిచేసినంత కాలం భరించాలేమో???

ఈ మట్టి రోడ్ల మలుపుల్లో ప్రయాణించి నేను జూనియర్ కాలేజీ చేరుకొనేసరికి నా ముఖం కారం పట్టిచ్చిన కోడిగుడ్డులాగా అయిపోయింది. కళాశాల ఆవరణ మొత్తం పరికించి చూసాను. అన్నీ సైకిళ్ళు మాత్రమే కనిపించాయి. 'ఓహో..... మనకు మాత్రమే పల్సర్ ఉన్నట్టుంది కాబోలు' మనసులో అనుకొని ....మహారాజులా మురిసిపోయాను. ఆ ప్రభుత్వ జూనియర్ కళాశాల చెట్లతో పచ్చగా కళకళలాడుతూ ఉంది. హంగు ఆర్భాటం లేని ఒక గదిలో కుర్చీ మీద కూర్చొని వున్న ప్రిన్సిపాల్ గది వద్దకు వెళ్ళి నా నియామక ఉత్తర్వులను అందజేసాను.

"కుర్రాడిలా ఉన్నావ్.... చదువు చెబుతావా...నేర్చుకొంటావా??" ప్రిన్సిపాల్ అడిగారు. అదే వెటకారం. కడప జిల్లా కారానికి

...గోదావరి జిల్లాలు వెటకారానికి పెట్టింది పేరు. మరి చూస్తుంటే చిత్తూరు జిల్లా చమత్కారానికి మరో పేరులా వుంది.

"ఈ పల్లెటూరిలో నేను నేర్చుకునేది ఏముంటుందండి?" సమాధనం చెప్పాను.

"ఇంకో విషయమండి....ప్రిన్సిపాల్ గారు....నేను సెంట్రల్ యూనివర్సిటీలో చదువుకొన్నాను. బయోటెక్నాలజీలో డాక్టరేట్ ఉంది. విదేవాలకు వెళ్లవలసిన వాడిని....టైం బాగోలేక ఈ జూనియర్ కాలేజీలో లెక్చరర్ ఉద్యోగానికి వచ్చాను" అంటూ చెప్పుకొచ్చాశాను. అప్పటికి నేను మీ విద్యార్థులు చేసుకొన్న అదృష్టమన్నట్టు ఉన్నాయి నా మాటలు.

"ఏం బయో టెక్నాలజీనో ఏమో గానీ....ఇక్కడి విద్యార్థులకు టెక్కు ...నిక్కు రెండూ ఎక్కువే. నచ్చితే ప్రాణమిస్తారు...నచ్చకుంటే పంచ్ డైలాగులతో తీస్తారు" హెచ్చరించాడు ప్రిన్సిపాల్. ఊరి సర్పంచు కొత్తగా ఉద్యోగంలో చేరిన నాకు విందు కూడా ఇస్తాడని గుర్తుచేసాడు.

ఇక క్లాసులోకి ప్రవేశించాను. ఎక్కడా కొద్దిగా దుమ్ము కూడా కనిపించలేదు. అరవై మంది వరకు స్టూడెంట్స్ ఉన్నారు. అందరూ తెల్ల దుస్తులే వేసుకొన్నారు. వారిని చూస్తుంటే తరగతి గదిలో వసంతం విరబూసినట్టుగా వుంది. వారందరి పేర్లు కూడా సుధాంశు, తరళాక్షి, వనజాక్షి ఇలా సాహితీ స్పృహ కలిగినవే ఉన్నాయి. నన్ను నేను పరిచయం చేసుకొని నేను బయోటెక్నాలజీ ఢిల్లీలో చేసానని చెప్పాను.

"బయో టెక్నాలజీ అంటే" ఒకడడిగాడు. వాడు నా కళ్ళకు అచ్చు వెర్రి వెంగళాయి లాగానే కనిపించాడు. 'జూ' లో ఉండాల్సిన వాడు జూనియర్ కాలేజీలో చేరాడేమో అని అనుమానం కూడా వచ్చింది.

"జంతువులను ఉపయోగించుకొని మానవులకు కావాల్సిన పదార్థాలను తయారు చేయడమే బయోటెక్నాలజీ" గర్వంగా చెప్పాను.

"ఓస్ ....ఇంతేనా... మా నాయన ఎద్దును కట్టి కయ్య దున్నుతుంటాడు. ట్రాక్టర్ వాడితే టెక్నాలజీ....ఎద్దులు వాడి వ్యవసాయం చేస్తే బయో టెక్నాలజీ. ఈ మాత్రం దానికి ఢిల్లీ ఎందుకు....ఏ గల్లీలో అయినా నేర్చుకోవచ్చు కదా సారూ" రాణి అనే అమ్మాయి సన్నాయిలా మాట్లాడింది. ఈ పంచ్ కు నాకు కళ్ళు బైర్లు కమ్మాయి. వెంగళాయి నాకు తగిలిన పంచ్‌కు తెగ సంబరపడినట్టుగా కనిపిస్తున్నాడు. నేను కూడా గందరగోళానికి గురయ్యాను?... నిజమే కదా ఈ మాత్రం దానికి ఢిల్లీ ఎందుకు వెళ్ళాను? నా మనసు మధన పడింది.



"అది మాత్రమే కాదు... బ్యాక్టీరియా లాంటివి ఉపయోగించి కూడా చాలా పదార్థాలు తయారుచేయవచ్చు. పెరుగు ఒక ఉదాహరణ" అని కొనసాగించాను.

"ఐతే అయ్యతో పాటు అమ్మ కూడా బయెూటెక్నాలిజిస్టే" సుధాంశగొణగడం వినపడింది.

నాకు రోషం ఎక్కువయ్యింది. 'నేను మలబద్ధకానికి కనిపెట్టిన చార్‌కోల్ టాబ్లెట్స్‌కు పేటెంట్ ఉంది తెలుసా?' రెట్టించాను.

'చార్ కోల్ అంటే ఏంది సారూ' చారులత ఎదురు ప్రశ్న.

'ఇది కూడా తెలీని మీకు చదువు చెప్పడం నా దురదృష్టం. చార్‌కోల్ అంటే బొగ్గు'. కొంచెం నిష్టూరంగా చెప్పాను.

'అయ్యోరూ ...మా పల్లెటూళ్ళ వారికి మలబద్ధకం లేకపోవడానికి మేము పళ్ళు తోమే బొగ్గు పొడే కారణం అన్న మాట!!' చారులత మెత్తగా చెప్పినా....నాకు గూబ అదిరినంత పనయ్యింది.

అంతలో బెల్ మోగడంతో బతుకు జీవుడా అనుకొన్నాను. వీరితో పెట్టుకొంటే నా సామర్థ్యం మీద నాకే అనుమానం వచ్చేలా వుంది.

స్టాఫ్ రూమ్ లో కూర్చొని ఆలోచనలో పడాడ్డను. ఈ పల్లెటూరి పిల్లలకు ఇంత సామాజిక స్పృహ ఎక్కడిది? మీరు నేను ప్రయోగశాలలో కనిపెట్టిన అంశాలను క్షేత్ర స్థాయిలో వివరిస్తున్నారు. వీరి జీవితమే ఒక ప్రయోగశాల లాగా నాకిప్పుడు కనపడుతున్నది. పసుపు, వేప, వెర్మికంపోస్ట్, అనేక వ్యాధులకు గృహ వైద్యాలు అన్నీ పల్లె సీమల్లో కనిపెట్టినవే కదా!!

దానికి పెట్టుబడిదారి వ్యవస్థకు ప్రతీక అయిన అమెరికా పేటెంట్లు తీసుకొని మన ఆర్థిక స్వావలంబనను ఎంత ఘోరంగా దెబ్బ తీస్తున్నదో తెలుసుకొంటే బాధతో హృదయం బరువెక్కింది. పల్లెటూరి వారిలో నాకు ఇంతవరకు కనిపించింది అజ్ఞానం కాదనీ....అమాయకత్వం అని అర్థమయ్యింది. సమాజ హితం కోసం మాత్రమే వారు ఆలోచిస్తారని.....వారు చేసిన ఆవిష్కరణలను కూడా నిస్వార్థంగా సమాజానికి పునరంకింతం చేస్తారని బోధపడింది. వారికి 'బడి'కి 'మడి' కి తేడా లేదని తెలిసొచ్చింది.

నాకు ఇప్పుడు నా విద్యార్థులు అంతా ఆధునిక విజ్ఞానానికి బ్రాండ్ అంబాసిడర్‌ల లాగా కనిపించారు. తెల్లవాడు కనిపెట్టిన ప్రతి నూతన ఉత్పత్తికి మూలం నా పల్లె సీమలో ఉందని తెలిసి కొద్దిగా గర్వంగా కూడా అనిపించింది.

ఇంతలో గిరిజ వచ్చి 'సారూ....ఏంది ఆలోచిస్తున్నారు...మిమ్మల్ని సర్పంచ్ బువ్వ తినడానికి పిలుస్తున్నారు' అని చెప్పడంతో లేచాను. పిల్లలలోనే ఇంత సామాజిక స్పృహ ఉంటే.....ఇక సర్పంచులో ఎంత ఉండవచ్చో కదా అనుకుంటూ బయలుదేరాను. నాకు ఇప్పుడు ఈ మారుమూల పల్లె అయిన చవటగుంటనే విశ్వవిద్యాలయంగా కనపడుతోంది. మా ప్రిన్సిపాల్ అన్నట్టు .....నేను ఇప్పుడు మా విద్యార్థులకు చదువు చెప్పడం లేదు. నేర్చుకుంటున్నాను.

◆





మళ్లీ నలుపు-తెలుపులు

ఒకప్పుడు నలుపు-తెలుపుల్లో ఉన్న ఛాయా చిత్ర కళ రంగుల్లో మారి కొత్త జీవాన్ని పోసుకుందని చాలామంది అనుకుంటారు. కానీ గ్రే-స్కేల్‌లోనే ఏదో విలక్షణత ఉందని ప్రముఖ ఫొటోగ్రాఫర్లు చెబుతుంటారు. అందుకే కొందరు వెనక్కు వెళ్లి ఆ ఆపాత చిత్రాల్లోకి తొంగి చూస్తుంటారు. ఇంకొందరు దీన్నే కళగా మార్చుకుని భవిష్యత్తుని వెతుక్కుంటారు. టెక్నిక్‌ని పడితే బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు అద్భుతంగా బంధించొచ్చు. పొట్రెయిట్‌లలోని డీటైల్స్‌ను గొప్పగా చూపించొచ్చు. భ్రమకు, కల్పనకు, వాస్తవానికి జోడి కుదిరించొచ్చు. బ్లాక్ అండ్ వైట్ ఫొటోల్లో కుటుంబ ముఖ చిత్రాల్ని భద్రపరచుకోవడం ఇప్పుడో ట్రెండ్ అయిపోయింది. రంగులతో కళకళలాడే పెళ్లి ఫొటోల ఆల్బమ్‌లోను ఒక నలుపు-తెలుపుల మ్యాజిక్ చేరాల్సిందే. వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ నుంచి ఫ్యాషన్ మేగజీన్ల వరకు ఇదో ఫ్యాషన్‌గా మారిపోయింది. చీకటి తీరాల్నే కాదు రంగుల లోకాలు కూడా బ్లాక్ అండ్ వైట్‌లో సరికొత్తగా కనిపిస్తున్నాయి. కావాలంటే మీరే చూడండి.







మరో అమ్మ

రక్త దానం, అవయవ దానాలని చేసేవారి గురించి చదివేవుంటారు మరి తమకి పరిచయంలేని చిన్నారులకి పాలందించే తల్లుల గరించి ఎప్పుడా తెలుసుకున్నారా.....? అవును నిజమే నండి నమ్మకం కుదరకపోతే ఎలిజబెత్ ఆండ్రసన్ గురించి గురించి చదివేయండి. ఒరిగానో బేవర్టన్ ప్రాంతానికి చెందిన ఎలిజబెత్ యాండ్రసన్ సైరా(29)కి ఇద్దరు పిల్లలు. మొదటి సంతానం ఇస్బెల్లా పుట్టినప్పటి తనకి సరిపడా పాలు అందించలేక డోనార్స్‌పై ఆధారపడాల్సొంది. ఆ చిన్నారికి పాలందించడంలో చాలా కష్టపడాల్సొచ్చిందిట తనకి. ఆ తర్వాత ఓ రోజు హటాత్తుగా తన స్థనాల ద్వారా చిన్న ధారలా పాలు విడుదలవడ్డం మొదలయ్యింది. రోజూ అలానే అవుతుండడంతో వాటిని పిండి పక్కన పెట్టడానికే ఎక్కువసమయం కేటాయించాల్సి వచ్చేదట ఎలిజిబెత్‌కి. మొదట్లో తనకి ఇందంతా చాలా చికాకనిపించింది. డాక్టర్‌ని సంప్రదించడంతో హైపర్ ల్యాక్టేషన్ సిన్డ్రోమ్ కారణంగా తన స్థనాల నుండి అధికంగా పాలు విడుదలవుతున్నాయనే విషయం తనని మరింత కంగారు పెట్టింది. అయితే చుట్టుపక్కల కొన్ని కుటుంబాల్లో ఇప్పెల్లాలా తల్లి పాల కొరతతో భాధపడుతున్నారనే విషయాలు చెవిన పడ్డాయి. అప్పుడే తన స్థనాల ద్వారా విడుదలవుతున్న అధిక పాల దారల్ని వృధా కాకుండా ఆ చిన్నారులకి అందించాలనే ఆలోచన తట్టింది తనకి. అప్పటి నుండి రోజుకి ఐదుసార్లు పాలని తీసి ఫ్రిజర్‌లో భద్రపరచడం మొదలు పెట్టింది. ఇలా స్థనాల నుండి రోజుకి దాదాపు ఆరులీటర్లపాలు విడుదలవుతాయి. రోజుకి ఐదు గంటల పాటు పాలని తీసేందుకే తను కేటాయిస్తోంది. తన వద్దకి వచ్చే తల్లుల సంఖ్య పెరిగినప్పుడల్లా తను రోజుకి ఎనిమిది నుండి పదిగంటలు కేటాయిచ్చేస్తోంది. ఓ చిన్న ప్రాణాన్ని బతికించేయడంలో అంత ఆనందం వుందో ఎలిజిబెత్‌ని చూస్తే అర్ధమవుతుంది. పాలని భద్రపరచడంలోనూ తను ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటుంది. ఇలా చుట్టుపక్కల వారికే కాదు తల్లిపాల లేమితో బాధపడే చిన్నరులకోసం క్యాలిఫోర్నియాలో ఏర్పాటు చేసిన ప్రొల్యాక్టో బయోసైన్స్‌కి ప్యాకెట్స్ రూపంలో పాలని అందిస్తోంది. ఇప్పటి వరకు 2548లీటర్ల పాలతోలని అందించింది ఎలిజిబెత్. చిన్నారుల కోసం ఈ సాయం ఇలా కొనసాగించాలనేది ఎలిజిబెత్ సంకల్పం.

కథా సాహిత్యంలో సరికొత్త ప్రయోగం

తెలుగు సాహిత్యంలో ఉన్న పలు ప్రక్రియల్లో చాలా ప్రయోగాలు జరిగాయి, కవిత్వంలో అయితే ఎన్నో ప్రక్రియల్లో ఎన్నెన్నో ప్రయోగాలు. వచనానికి వచ్చేసరికి గొలుసు నవల, నవలిక, గల్పిక లాంటి ప్రయోగాలు కూడా జరిగాయి. అయితే ఒక పక్క పద్యాన్నీ, కథాసాహిత్యాన్నీ మేళవించి చేసిన ప్రయోగం మాత్రం చాలా అరుదైనదే. అలాంటి వినూత్న ప్రయోగాన్నే చేసారు తెలంగాణ రచయిత డాక్టర్ బివిఎన్ స్వామి. "కశప-కథాశతక పద్యం" పేరుతో తీసుకొచ్చిన ఈ పుస్తకం ఆయన చేసిన వినూత్న ప్రయోగానికి దర్పణంగా నిలిచింది. కొత్త పద్ధతిలో 117 కథలతో ఈ పుస్తకాన్ని తీసుకొచ్చారు.

కథకునిగా డాక్టర్ బివిఎన్ స్వామి పేరు తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదు. ఆయన పూర్తి పేరు భైరవి వెంకట నర్సింహస్వామి. కథా సాహిత్యంలో ఈ తరహా రచనను తొలి ప్రయోగంగా చెప్పొచ్చు. ఇందులో కథకు, శతకానికి మధ్య సమన్వయం చేస్తూ రాశారు. పద్యం ఇష్టమే అయినప్పటికీ తానెప్పుడూ రాయలేదు. కవిత్వంలో అనేక ప్రయోగాలు వచ్చాయి. కథా సాహిత్యంలో మాత్రం ప్రయోగాలు రాకపోవడమే తన కొత్త ఆలోచనకు రూపమిచ్చిందని పరిచయంలోనే పేర్కొన్నారు. వివిధ సంఘటనల ఆధారంగా కథ రాసి అందుకు సంబంధించిన సారాంశం ఉన్న పద్యాన్ని ఆ కథకు జోడింపుతో కొత్త ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇందులో అన్నీ చిన్న కథలే. ఏదీ ఒక పేజీ కూడా దాటదు. ఈ పుస్తకంలో మల్లికార్జున పండితుని 'శివతత్వసారం' మొదలుకుని ఇందూరు పద్యభారతి 'తెలంగాణ శతకం' వరకూ చాలా శతకాలను తడిమారు. వాటి నుంచి కొన్ని పద్యాలను ఎంచుకుని తాను, బుంగి అనే పాత్రల ద్వారా కథలను నడిపించారు. ఈ పుస్తకానికి ముందుమాట రాసిన ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి చెప్పినట్లు...వృషాధిప శతకంలోని 'అంబలి'ని తీసుకొని ఒక డాక్టర్ నిర్వహించే అంబలి కేంద్రానికి సమన్వయం చేసారు. 'అనగనగరాగ' పద్యాన్ని ఒక చిత్రకారుని సాధనకు అన్వయించి చక్కని కథరాసారు. 'తను' అనే కుమారీ శతక పద్యాన్ని చేనేత కార్మికుల ఆత్మ హత్యలకు సమన్వయం చేస్తూ రాసిన కథ, 'కోవెల' పద్యాన్ని రైతుల ఆత్మహత్యల నేపథ్యంలో కథగా విశ్లేషించడం బాగుంది. ఈ పుస్తకంలో బమ్మెర పోతన 'నారాయణ శతకం', బద్దెన 'సుమతి శతకం', వేమనశతకం', కంచెర్ల గోపన్న 'దాశరధి శతకం', దూర్జటి 'కాళహస్తీశ్వర శతకం', గువ్వలచెన్న శతకం,

నార్ల మాట..నవయుగాలబాట', శ్రీశ్రీ 'సిరిసిరిమువ్వలు' శతకం, కవిచౌడప్ప శతకం, జంధ్యాల పాపయ్యశాస్త్రి తెలుగుబాల శతకం ఇలా ప్రాచీన, ఆధునిక శతకాల్లోని పద్యాలనెన్నింటినో స్వీకరించి సమకాలీనాంశాలపై కథలు రాయడం చాలా విశిష్టమైన ప్రయోగమే. కథాభిమానులకు ఈ పుస్తకం సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది. రచయిత డాక్టర్ బివిఎన్ స్వామి మరిన్ని ప్రయోగాలతో కథాసాహిత్యంలో కొత్త పుంతలు తొక్కాలని ఆశిద్దాం.

- బెందాళం క్రిష్ణారావు

కశన (కథాశతక పద్యం)
రచన: డాక్టర్ బివిఎన్ స్వామి **పేజీలు :** 140,
ధర: రూ 95/-
ప్రతులకు : నవచేతన, విశాలాంధ్ర, ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

కెన్యాలో మన తెగ

విదేశాల్లో వుండేవారు ప్రధానంగా ఎదుర్కొనేది స్థానికత సమస్య. ఇక ప్రమాదాలు అత్యవసర పరిస్థితుల్లో వలస బాట పట్టిన వారికి అడుగడుగునా ఎదురయ్యేది గుర్తింపు సమస్య . శతాబ్దాల క్రితం కెన్యాకి వెళ్ళిన భారతీయులకి ఇలాంటి సమస్యలే ఎదురయ్యాయి. అయితే ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితుల్లో మార్పొచ్చింది. ఇటీవలే కెన్యాలో స్థిరపడిన భారత సంతతిని తమ దేశపు 44వ భారతీయ తెగగా ప్రకటించింది అక్కడి ప్రభుత్వం. ఇంతకీ కెన్యాలో స్థిరపడిన ఈ భారతీయులందరూ ఏ ప్రాంతానికి చెందినవారు? అసలక్కడికి ఎలా వెళ్ళారనే విషయాలు తెలియాలంటే మీరే చదివి తెలుసుకోండి.

కెన్యాలో జనాభాలో ఎక్కువ మంది ఆసియాలోని వివిధ ప్రాంతాలకి చెందిన వారే. అందులో భారతీయులు 30శాతంగా వుంటారు. కెన్యాలో భారతీయుల ప్రస్థానం 19 వ శతాబ్దం తొలినాళ్ళలోనే మొదలయ్యింది. కొందరు భారతీయ వర్తకులు తూర్పు ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలని తమ వాణిజ్య స్థావరాలుగా మార్చుకున్నారు. నావికా కార్యకలాపాలపై బ్రిటిష్ ప్రభుత్వం ఆధిపత్యం ఎక్కువగా వుండటంతో హిందూ మహాసముద్రం తూర్పు ఆఫ్రికా తీరప్రాంతాల



మధ్య జరిగే వాణిజ్య కార్యకలాపాల్లో భారతీయ వర్తకుల సంఖ్య కూడా ఎక్కువేలే. 1887లో బ్రిటిష్ ఈస్ట్ ఆఫ్రికా అసోసియేషన్ తన ప్రధాన కార్యాలయాన్ని బొంబాయిలో స్థాపించడంతో బ్రిటిష్ ఈస్ట్ ఆఫ్రికా కంపెనీలో ఉద్యోగస్తులుగా కొందరు భారతీయులని నియమించుకుంది. కెన్యాలో స్థిరపడిన భారతీయుల్లో ఇలాంటి వారే ఎక్కువ. కెన్యా స్వతంత్ర దేశంగా ఏర్పడే నాటికి అక్కడ భారతీయులు రెండు శాతం. హోల్‌సేల్ రీటెయిల్ రంగాలతోపాటు వస్తుతయారీ రంగాల్లో స్థిరపడిన వీళ్ళలో కొందరు గోవా, గుజరాత్ ప్రాంతాల వారూ వున్నారు. అలా నైరోబీల జనాభాలో భారతీయుల శాతం 30కి చేరుకుంది. 1896-1991ల మధ్య ఉగాండ రైలు మార్గ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 32 వేల మంది భారతీయులు రైలు నిర్మాణ పనుల్లో పనిచేశారు. ఉగాండ రైలు మార్గం నిర్మాణ దశలోనే వున్నప్పుడే వివిధ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వాటిలో దాదాపు 2500 మంది చనిపోయారనేది ఒక అంచనా. రైలు మార్గ నిర్మాణంలో ప్రతి మైలుకి నలుగురు కార్మికులు చనిపోయేవారు. దీనికి తోడు అక్కడ కార్మికులు ఏర్పరుచున్న స్థావరాలపై అక్కడి సావో పులుల దాడుల్లో చనిపోయిందీ ఎక్కువగా భారతీయులే. అలా కార్మికులని రక్షించేందుకు అప్పట్లో సావో మ్యాన్ ఈటర్స్ పేరున పరిరక్షణ కార్యక్రమాలు జరిగాయి. రైలు నిర్మాణ పనులు పూర్తయ్యాక కొందరు తమ ప్రాంతాలకి వెళ్ళిపోయారు. అయితే కొందరు మాత్రం అక్కడే వుండిపోయారు. అలా కొన్ని భారతీయ కుటుంబాలు కెన్యాలోని ఓ ప్రాంతంలో స్థిరపడిపోయాయి. రైలు మార్గం పూర్తయిన తర్వాత అక్కడ వాణిజ్య కార్యకలాపాలు మరింత ఊపందుకోవడంతో గుజరాతీలు, పంజాబీలు ఎక్కువగా కెన్యాలో స్థిరపడ్డారు. ఒక దశలో ఒకే వర్గం, గ్రామానికి చెందిన భారతీయులు కెన్యాకు వలస బాట పట్టారు. అలా నైరోబి ఆసియాలోని వివిధ ప్రాంతాల నుండి వలసవెళ్ళిన వారికి ప్రధాన కేంద్రంగా మారింది. నైరోబి అప్పటి బ్రిటిష్ పాలిత ప్రాంతాలకి రాజధాని. 1905 నాటికి అక్కడి ఆఫ్రికన్‌లతో సమానంగా ఆసియా నుండి వలస వచ్చిన వారు అక్కడ నివసించేందుకు చట్టపరమైన అనుమతులు లభించాయి. వ్యాపారం, తయారీ రంగాల్లో ఎక్కువమంది భారతీయులు అక్కడ నిలదొక్కుకున్నా పాలన విషయంలో మాత్రం వెనుకబడేవున్నారు. దేశాభివృద్ధిలో భాగమయ్యేలా తమకి రాజకీయాల్లో ప్రవేశానికి అనుమతించాలంటూ వీళ్ళు కోరుకున్నా అది పూర్తిస్థాయిలో అమలవలేదు. అప్పటి నుండి స్వేచ్ఛ సమానత్వం దిశగా అక్కడ పోరాటాలు జరుగుతూనే వున్నాయి. 1963లో బ్రిటిష్ పాలన నుండి కెన్యా స్వాతంత్ర్యం పొందడంతో

యూరప్, ఆసియా ఖండాల నుండి వలస వలస వెళ్ళిన వారికి కెన్యా స్థానికతని పొందేందుకు కొంతకాలం అనుమతించారు. అయితే అప్పట్లో స్థానికతని పొందలేని వారు గుర్తింపుకి సంబంధించి సమస్యలతోపాటు జాతి అహంకార దాడులని ఎదుర్కోవాల్సివచ్చేది. అయితే ఇటీవలే కెన్యా ప్రభుత్వం అక్కడున్న భారతీయులని కెన్యాకి చెందిన 44వ తెగగా గుర్తించినట్టు అధికారికంగా ప్రకటించింది. అక్కడ స్థానికత సమస్యని ఎదుర్కొంటున్న ఎంతో మంది భారతీయులకి ఇదో మంచి పరిష్కారం.

వివరం



పీడ కలలతో ఉలిక్కిపడి మంచం నుంచి కిందపడటం... గుండె బరువెక్కి శ్వాస ఆగి దిగ్గున లేచి కూర్చోవడం... ఉక్కతో ఊపిరాడక పడక పక్కన పెట్టేయడం ఇవన్నీ కూడా అందరికీ ఎప్పుడో ఒకప్పుడు ఎదురయ్యే నిద్రావస్త అవస్థలే. కానీ ఈ కుర్రాడి పరిస్థితి అది కాదు. నిద్ర పోతే చనిపోయే అవకాశం ఉంది. తెలివిలో లేకుంటే శ్వాస పీల్చడం మర్చిపోతుంది ఇతడి శరీరం. ఓ ఫ్రెంచ్ జానపద కథలోని శాపంలా కనిపించే ఇది ఓ అరుదైన వ్యాధి.

నిద్రోస్తే అంతే..

ఫ్రెంచ్ జానపదాల్లో వోన్‌డైన్ శాపం అనే మాట వినపడుతుంది. వోన్‌డైన్ అనే యువతి పాలెమోన్ అనే యువకుడితో ప్రేమలో పడుతుంది. ఆమె అంతలా ఆ అబ్బాయికి అంకితమైపోవాడానికి కారణం అతడిపై ఉన్న నమ్మకం. జీవితాంతం ప్రతి శ్వాసలోను ప్రేమిస్తాను అని అతడిచ్చిన వాగ్దానం ఆమెను ఉద్వేగానికి లోను చేస్తుంది. ఎంతో ఇష్టంగా అతణ్ని వరిస్తుంది. ఆ తర్వాత ఆమెకు ఓ విషాదకర వాస్తవం తెలుస్తుంది. తన ప్రియుడు మోసగాడని. ఆమె హృదయం బద్దలవుతుంది. తననంత క్షోభకు గురిచేసిన పాలెమోన్‌ను శపిస్తుంది. 'నీవు పీల్చే ప్రతి శ్వాసలోను నన్ను ప్రేమిస్తానన్నావుగా.. నీవు శ్వాస పీలుస్తున్న విషయం గమనించగలిగేంత వరకే నీవు బతికి ఉంటాని' అని వదిలి వెళ్లిపోతుంది. అంటే పాలెమోన్ నిద్రలోవు జారుకుంటే అతడు శ్వాస తీసుకుంటున్న విషయం తెలీదు. చనిపోతాడు. అలా 'వోన్‌డైన్ శాపం' జనం భాషలోకి వచ్చేసింది. ఈ జానపదానికి లియామ్ డెర్బీషైర్ అనే కుర్రాడి వ్యాధికి ఏం సంబంధం లేకున్నా ఆ లక్షణాలున్న వ్యాధి కనుక అదే పేరు పెట్టేశారీ 'సెంట్రల్ హైపోవెంటిలేషన్' రుగ్మతకు. మొత్తం ప్రపంచంలో ఈ వ్యాధితో బాధపడుతోంది కేవలం 1500 మందే అని లెక్కలున్నాయి. కానీ లియామ్ విషయంలో ఇది మిగతా వారి కంటే తీవ్ర స్థాయిలో ఉంది. సాధారణంగా నిద్ర నుంచి దూరమయ్యే కేసులున్నాయి గానీ లియామ్ రెప్ప వేస్తే శ్వాస ఆగిపోవడమనేదే తీవ్రత. లియామ్‌కు వచ్చిన ఈ అరుదైన వ్యాధితో అతడు ఆరు నెలలు కూడా బతకలేడని వైద్యులు ఎప్పుడో చెప్పారు. కానీ లియామ్‌కు ఇప్పుడు 18 ఏళ్లు వచ్చినా మృత్యువుని ప్రతి రోజూ జయిస్తూనే వస్తున్నాడు. మరి ఇన్నాళ్లు



ఎలా ఉంటున్నాడు? అస్సలు నిద్ర పోవడం లేదా? అనే అను మానం సహజమే కానీ. లియామ్ నిద్ర ఏర్పాట్లు సహజంగా ఉండవు. అతడి పడక గది ఆస్పత్రి ఐసీయూ వార్డును తలపిస్తుంది. కృత్రిమ శ్వాస పరికరాల ద్వారా వెంటిలేటర్‌పై అతడు నిద్ర తీసుకునే వీలు కల్పించారు వైద్యులు. తొలుత చాలా జాగ్రత్తగా అతడి నిద్రావస్థను గమనించేవారు. ఆ తర్వాత ఆస్పత్రిలో ఇక ఉండాల్సిన అవసరం లేదనుకున్నాకే అతడి సెట్టింగ్‌ను ఇంటికి మార్చారు. ఈ లైఫ్ సపోర్ట్ సిస్టమ్ లేకుండా అతడు చిన్నపాటి కునుకు కూడా తీసుకోలేడు. ఇలాంటి పరిస్థితిలోను లియామ్ జీవితం మీద ఆసక్తిని కోల్పోలేదు. లెగో బ్రిక్స్‌తో అద్భుతమైన నిర్మాణాలు చేస్తూ సృజనాత్మక కళలో మునిగిపోతుంటాడు. అవి తన వైద్య పరికరాలకు నప్పే విధంగా రూపొందించి ఆస్పత్రి వాతావరణం నుంచి బయటపడే ప్రయత్నం చేస్తుంటాడు. పడక మీది సెన్సర్లు అతడిని నిరంతరం పరీక్షిస్తూనే ఉన్నా ఎవరో ఒకరు అతడిని కనిపెట్టుకుని ఉండాల్సిందే. అంటే లియామ్ నిద్ర కోసం కుటుంబ సభ్యులు రోజుకొకరు చొప్పున తమ నిద్రను త్యాగం చేయాల్సిందే. లియామ్ వైద్య పరికరాలన్నీ విద్యుత్‌తో నడిచేవే కావడంతో కరెంట్ కోతల భయం ఉండి బ్యాక్-అప్ పవర్ సపోర్ట్‌ను అమర్చుకోవాల్సి వచ్చింది. అతడి మందుల ఖర్చులతో సమానంగా ఇంటి విద్యుత్ ఖర్చులుంటాయి.

లియామ్ తల్లి కిమ్‌కు ప్రతి రోజు ఒక పుట్టుకలాగే అనిపించేది. పురుడు నాటి వ్యథను ప్రతి రోజు మానసికంగా అనుభవించేది. బిడ్డ పుట్టగానే ఇంకా ఆరు నెలలే అన్న వైద్యుల మాటలతో ఆమె జీవితం చీకట్లోకి వెళ్లిపోయింది. కానీ 11 ఏళ్ల వయస్సు నాటికి లియామ్ సాధారణ పిల్లల్లానే అన్ని విషయాల్లో చురుగ్గా ఉండటం చూశాక ఆమె మరో జీవితం మొదలైంది. అప్పటి నుంచి మారే ప్రతి రోజు వారి సంతోషాలకు బోనస్‌గా అయ్యింది. నిజంగానే లియామ్‌ను చూస్తే సాధారణ కుర్రాడిలానే అనిపిస్తాడు. అతడికిలాంటి వ్యాధి ఉందనే విషయం అస్సలు ఊహించలేరు.

ఇది వైద్యుల్ని కూడా ఆశ్చర్యానికి గురి చేస్తోంది. లియామ్ అనారోగ్యానికి బోనస్‌గా వచ్చిన క్యాన్సర్‌ను కూడా అతడు జయించడం ఇందులో మరో అద్భుతం. అతడింకా ఇలా మృత్యువుతో పోరాడగలడనే విషయం ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఎందుకంటే ఎప్పుడో లియామ్ ఉనికి ఉండేది కాదు. ఇదంతా కూడా తల్లిదండ్రుల పోరాటం, అతడి మనో బలానికే వదిలేస్తున్నారు వైద్యులు. తమ వంతు చికిత్స చేస్తూ అతణ్నో అరుదైన కేస్‌గా గమనిస్తున్నారు. వైద్యులేమో గానీ మనం అందాం ఇంకా 82 ఏళ్లు అని. ◆

చికెన్ పోపెర్స్



కావాల్సిన పదార్థాలు

చికెన్-1/4 కిలో
ఉప్పు-తగినంత
మిరియాలపొడి-
1 టేబుల్ స్పూన్
అల్లం వెల్లుల్లి పేస్ట్-
1 టేబుల్ స్పూన్
గుడ్లు- 3
గోధుమ పిండి-1 కప్పు
నూనె- డీప్ ఫ్రైకి సరిపడా
వెన్న -5 టేబుల్ స్పూన్లు
సోయా సాస్-
2 టేబుల్ స్పూన్లు
టమాటా-1(మెత్తని గుజ్జు)
నిమ్మరసం-3 టేబుల్ స్పూన్లు
తేనె -ముప్పావు కప్పు

తయారు చేసేవిధానం

ముందుగా చికెన్ ముక్కల్ని శుభ్రం చేసుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక బౌల్ తీసుకుని అందులో చికెన్ ముక్కలు, ఉప్పు, మిరియాల పొడి, వెల్లుల్లి పేస్ట్, అల్లం పేస్ట్, వేసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు రెండు చిన్నచిన్న బౌల్స్ తీసుకుని ఒకదానిలో గుడ్డుసొన మరో దానిలో గోధుమ పిండి తీసుకోవాలి. స్టవ్ వెలిగించి పాన్‌లో నూనె వేసి వేడెక్కనివ్వాలి. ఈ లోపు చికెన్ ముక్కల్ని ఒక్కొక్కటిగా గోధుమ పిండిలో అద్ది తర్వాత ఎగ్ బౌల్‌లో ముంచాలి. మళ్ళీ గోధుమ పిండిలో ముంచి ఫ్రైచేసుకోవాలి.అలా అన్ని చికెన్ ముక్కల్నీ డీప్ ఫ్రై చేసుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మరో పాన్ తీసుకుని వెన్న, సోయా సాస్, నిమ్మరసం, తేనె ఒకదాని తర్వాత ఒకటి వేసి వేడి చేసుకోవాలి. అందులో డీప్ ఫ్రై చేసుకున్న చికెన్ ముక్కలను వేసి కలుపుకోవాలి. కాస్త దగ్గర పడిన తరువాత దింపేసుకోవాలి. వీటిని చెట్నీలో నంజుకుని తింటే టేస్టీగా వుంటాయి.

బ్రెడ్ మాల్పో



కావాల్సిన పదార్థాలు

బ్రెడ్ స్లైస్ -8
మైదా పిండి-1 1/2 కప్పు
మొక్కజొన్న పిండి-1 టేబుల్ స్పూన్
పాలు-2 కప్పులు
పంచదార -2 కప్పులు
నీరు-1 1/2 కప్పు
నూనె-డీప్ ఫ్రైకి సరిపడా
డ్రై ఫ్రూట్స్-2 టేబుల్ స్పూన్లు
జీలకర్ర పొడి, యాలకుల పొడి-1 టేబుల్ స్పూన్

తయారుచేసే విధానం

ముందుగా ఒక బౌల్ తీసుకుని మైదాపిండి మొక్కజొన్న పిండి పాలు జీలకర్ర పొడి వేసుకుని బాగా కలుపుకోవాలి. అందులో ఇప్పుడు నూనె వేడి చేసి ఈ మిశ్రమాన్ని గరిటెతో గుండ్రటి అప్పడాల్లా చేసి నూనెలో వేసుకుని బాగా డీప్ ఫ్రై చేసు కోవాలి. ఇప్పుడు వేరే బౌల్ తీసుకుని నీరు, పంచదార వేసి బాగా మరిగించుకోవాలి. అందులో యాలకుల పొడి కూడా వేసి పాకం వచ్చేదాకా గరిటెతో తిప్పుకోవాలి.

ఇప్పుడు నూనెలో వేయించిన అప్పడాలకు పాకం బాగా పట్టించి వాటిపై మీకు నచ్చిన విధంగా గార్నిష్ చేసుకోవాలి.

ప్రాన్స్ పిజ్జా



కావాల్సిన పదార్థాలు

రొయ్యలు పెద్దవి-8
ప్లెయిన్ నాన్(రొట్టెలు) తయారీకి
పెరుగు-1కప్పు, అన్నం-2 కప్పులు, ఆలివ్ నూనె, మసాలా, కారం-1టేబుల్ స్పూన్, గుడ్లు-2, కొబ్బరి తురుము-1/2 కప్పు నూనె- తగినంత
పాలకూర తరుగు- 2 కప్పులు
నిమ్మకాయ చెక్క-1
కరివేపాకు-4 రెబ్బలు
కొత్తిమీర తరుగు-3 టేబుల్ స్పూన్లు
వెల్లుల్లి రెబ్బలు-2
ఉప్పు-సరిపడా
క్యాప్సికం తరుగు-1/2 కప్పు
కొబ్బరి పాలు-10 టేబుల్ స్పూన్లు
అల్లం-చిన్న ముక్క

తయారుచేసే విధానం

ముందుగా రొయ్యలు బాగా దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక బౌల్ తీసుకుని అందులో బాగా మెత్తగా ఉడికిన అన్నం వేసి ముద్దలా చేసుకోవాలి. కొబ్బరి తురుము కొబ్బరి తురుము, మసాలా, కారం, వేసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ఒక మిక్సీలో ఈ మిశ్రమాన్ని వేసుకుని పెరుగు, గుడ్లు, ఆలివ్ నూనె వేసి మిక్సీలో బ్లెండ్ చేసుకోవాలి. చిక్కని జ్యూస్ మారిన మిశ్రమాన్ని ఒక పాన్‌పై రెండు దళసరి రొట్టెలుగా చేసి నూనెలో దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. బయట దొరికే ప్లెయిన్ నాన్స్‌ని కూడా ఉపయోగించుకోవచ్చు. ఇప్పుడు ఒక బౌల్‌లో పాలకూర, వెల్లుల్లి రేకలు, కొబ్బరి పాలు, కరివేపాకు, అల్లం వేసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని రొట్టెపై స్ప్రెడ్ చేసి ముందుగా వేయించి పక్కన పెట్టుకున్న రొయ్యలను గార్నిష్ చేసుకోవాలి. తరువాత వాటిపై కొత్తిమీర, క్యాప్సికం ముక్కలు వేసి నిమ్మరసాన్ని చల్లితే ప్రాన్స్ పిజ్జా రెడీ!

బాల నేస్తాలు

లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేనో టాలీవుడ్ స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫొటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ : సాయి పల్లవి

ఏ నీడ ఎవరిది

పిల్లలూ! ఇక్కడ కొన్ని జంతులువులు వాటి ముందు కొన్ని నీడలు ఉన్నాయి. ఏ జంతువు నీడ ఎక్కడుందో గుర్తించి వాటిని జతచేయండి.



దారి కనిపెట్టండి

ఇక్కడ కనిపిస్తున్న ఈ వ్యక్తి ఆవతలి పక్కకు వెళ్లే దారిని కనిపెట్టండి.



చుక్కలు కలపండి



ఆకులతో బొమ్మ



కనిపెట్టండి



పదాలు పూరిద్దాం

ఇక్కడ కొన్ని బొమ్మలు వాటి పేర్లను వుంచాం. అయితే వాటి ఇంగ్లిష్ పేర్లలో ఒక్క అక్షరం మిస్సయింది. ఆ అక్షరాన్ని కలిపేస్తే పదం పూర్తవుతుంది. బొమ్మల ఆధారంగా మిస్సయిన అక్షరాన్ని గుర్తించి ఖాళీలో నింపేయండే!



_ite
_oy
_lane
_oat

t
b
k
p

జ: kite, toy, plane, boat

పొడుగు కాళ్ళ ఫ్లెమింగో

పిల్లలూ మీరు రకరకాల పక్షుల గురించి తెలుసుకుంటుంటారు కదా! నలుపు, తెలుపు, ఎరుపు ఇలా వివిధ రంగుల్లో వుండే పక్షులని చూసే వుంటారు. మరి ఎరుపు రంగులో వుండే ఫ్లెమింగోని ఎప్పుడైనా చూశారా..... మీరు వాటిని చూసుండకపోవచు ఎందుకంటే....

- అవి ఎక్కువగా కనిపించేది దక్షిణ అమెరికాలో. కరీబియన్ దీవులతోపాటు ఆఫ్రికా, యూరప్ మధ్యప్రాచ్య దేశాలల్లో ఇవి అక్కడక్కడా కనిపిస్తాయి.
- ఇంతకీ వీటికి ఆ పేరెలా వచ్చిందో తెలుసా? ల్యాటిన్ పదం ఫ్లెమెన్‌కొ నుండి వచ్చింది. ల్యాటిన్‌లో ఫ్లెమెన్ అంటే నిప్పు అని అర్థం. ప్రకాశవంతమైన ఎరుపు రంగు రెక్కల్ని కలిగుండే ఈ పక్షులకి అలా ఫ్లెమింగ్ అనే పేరు స్థిరపడింది.
- పొడవైన మెడ, కాళ్ళతోపాటు తెలుపు, ప్రకాశవంతమైన ఎరుపు కలగలుపు రంగుల్లో ఇవి అన్ని పక్షుల కంటే మరింత ప్రత్యేకంగా వుంటాయి.



- ఇవి నాలుగడుగుల ఎత్తు, 4–8 పౌండ్ల బరువుంటాయి.
- 30–40 అంగుళాల పొడవాటి కాళ్ళు , మెడ భాగంతో ఇవి అన్ని పక్షుల కంటే విభిన్నంగా కనిపిస్తాయి.
- నీటి మడుగులు, బురద మైదానాల్లో ఇవి ఎక్కువగా తిరుగుతుంటాయి. ఉప్పునీటిలో దొరికే నత్తలు, తేళ్ళు, నాచు లాంటి వాటిని ఎక్కువగా ఇష్టపడతాయి.
- ఇవి బురదలో కాళ్ళతో తవ్వి గుంతలని ఏర్పరుస్తాయి. ఈ గుంతల్లో వుండే చిన్న చిన్న కీటకాలు, జీవాలని బురద నీటితో సహా ముక్కు ద్వారా తీసుకుంటాయి. నీటి నుండి ఆహారాన్ని వేరు చేయడంలో వంపుతేలిన వీటి ముక్కు ఎక్కువగా పనిచేస్తుంది.
- మొత్తం ఆరు రకాలుగా వుండే ఫ్లెమింగో పక్షుల్లో కొన్ని మాత్రమే ఎగరగలవు.
- చిత్తడి నేలల వద్ద వుండే అడవుల్లో మగ పక్షులు గూళ్ళని ఏర్పాటు చేసుకుంటాయి.
- ఇవి తెలుపు రంగు శరీరంపై ఎరుపు రంగుతో ప్రకాశవంతంగా వుంటాయి. రెక్కల అడుగు భాగంలో నల్లటి రంగుని కలిగుంటాయి.



- ప్రకాశవంతమైన ఎరుపు రంగు రావడానికి ఇవి తినే సముద్ర జీవాల్లో బీటా కెరొటీన్‌తోపాటు నాచుని తీసుకోవడమే ప్రధాన కారణం.
- వీటి పిల్లలు మాత్రం మొదట బూడిద రంగుని కలిగుంటాయి. ఏడాది తర్వాత ఇవి ఎరుపు రంగులోకి మారతాయి.
- వేటగాళ్ళ దాడుల వల్ల వీటి సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టింది.
- ప్రపంచ వ్యాప్తంగా వీటి సంఖ్య ముప్పైవేల కంటే తక్కువే.

పదవికాసం 71

కూర్పు : రావెళ్ల

1		2	✿	3		4		5
	✿		✿		✿		✿	
6		✿	7		8	✿	9	
	✿	10		✿	11	12	✿	✿
13			✿	14	✿	15		16
✿	✿	17	18	✿	19		✿	
20		✿	21	22		✿	23	
	✿	24	✿		✿	25	✿	
26					✿	27		

ఆధారాలు

అడ్డం

1. వివేకం (3)
3. బంధు మిత్రులతో కలిసి చెట్ల కింద చేసే భోజనం (5)
6. న్యూస్ (2)
7. చైతన్యం (3)
9. చూసి (2)
10. వజ్రం (2)
11. రాత (2)
13. చిరుదరహాసమె (3)
14. కాకి అరుపు (1)
15. అటునుండి ప్రశ్న (3)
17. కంటి మురికి (2)
19. ఆంగ్ల గొట్టం (2)
20. చెత్తమోపు (2)
21. వండిన ఆహార పదార్థం (3)
23. సరుకులు ఉంచే గది కుడి నుండి (2)
26. సరిసమానం గజిబిజిగా (5)
27. నూనె తీసే యంత్రం అటు నుండి (3)

నిలువు

1. ఉదయాన. (5)
2. చదువు (2)
3. స్త్రీ (3)
4. ఒంటె (2)
5. కూతురు (3)
7. బలం (2)
8. పొడి (2)
10. భయం గజిబిజిగా (3)
12. ఆహ్వానం (3)
16. తాజాగా (5)
18. పూనకం- లేక ఆవేశం (2)
19. డబ్బు (2)
20. తొనలుండే ఒక పండు (3)
22. మోసగాడు (3)
24. మీరు నేను కలిసి (2)
25. జాతి (2)

సుడోకు

		3			4	5		2
	5				3			
		8			5	3	6	
			2			7	4	3
2	7		3				8	
3	4		7	5				
		5	4					6
9		2					5	
4					2	9		

గతవారం జవాబులు

5	3	4	6	7	8	9	1	2
6	7	2	1	9	5	3	4	8
1	9	8	3	4	2	5	6	7
8	5	9	7	6	1	4	2	3
4	2	6	8	5	3	7	9	1
7	1	3	9	2	4	8	5	6
9	6	1	5	3	7	2	8	4
2	8	7	4	1	9	6	3	5
3	4	5	2	8	6	1	7	9

✿	1 గో	2 దా	రి	✿	3 ఓ	4 ట	మి	✿
5 ప్ర	✿	రి	✿	6 వా	✿	కో	✿	✿
7 పం	కా	✿	8 మి	ర	ప	✿	9 య	10 కా
చ	✿	11 స	✿	ము	✿	12 హా	✿	వ
13 ప	రి	వా	రం	✿	14 వ	రి	మ	డి
దు	✿	రి	✿	15 కాం	✿	తం	✿	కుం
16 లు	వ	✿	17 వ	చ	నం	✿	18 గ	డ
✿	✿	19 గో	✿	నం	✿	20 డి	✿	లు
✿	21 తి	ల	కం	✿	22 లం	చా	లు	✿

కాశ్మీర్ పోలీసమ్మాయి

కాశ్మీరీ అమ్మాయిలకు చైతన్యం ఒకింత ఎక్కువే. అది అల్లర్ల కల్లోలంలో సోదరులకు అండగా నిలబడి ఆక్రోశించినపుడూ కనిపిస్తుంది. అది రక్షా బంధనంగా మారి పోలీసుగా భద్రతనిచ్చినప్పుడూ తెలుస్తుంది. ఆ చైతన్యం మనకూ బాగా కనిపించాలంటే ఇటీవల అక్కడ జరుగుతోన్న పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పరిశీలిస్తే అర్థమవుతుంది. కిందటి ఏడాది కంటే ఇంకా చెప్పాలంటే గతంలో కంటే ఎక్కువగా కాశ్మీరీ యువతులు పోలీస్ ఉద్యోగాలకు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంటున్నారు. జులై 20న లేహ్, కార్గిల్ ప్రాంతంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఖాళీలను భర్తీ చేసేందుకు జమ్మూకాశ్మీర్ పోలీస్ పరీక్షలు నిర్వహిస్తే... 299 మంది అమ్మాయిలు ఉత్తీర్ణులయ్యారు. గతేడాది దక్షిణ కాశ్మీర్ ప్రాంతం నుంచి 20 వేల మందికి పైగా యువతులు దరఖాస్తు చేసుకున్నారు. 2 వేల మందికి పైగానే ఉత్తీర్ణులయ్యారు. కొన్ని వందల మంది ఎంపికయ్యారు. తమ సోదరులు, చెల్లెళ్ల చదువులకు తాము తోడుగా ఉంటామని రిక్రూట్‌మెంట్‌కు వచ్చిన కొందరు చెప్పారు. తమ ఇంటినే కాదు ఊరిని కాపాడుకునే వృత్తి అంటే తమకెంతో గౌరవమని మరికొందరు... ఇలా కాశ్మీర్ పోలీసమ్మాయి మిగతా ప్రాంతాల యువతులకూ ప్రేరణ కలిగిస్తున్నారు.



యూరప్ పురాతన నాగరికతల్లో సెల్ట్‌లది ఒకటి. వేల యేళ్ల నాటి వీరి సంస్కృతి ఇంకా మనుగడలో ఉంది. వీరి సంగీతం స్వచ్ఛమైన అడవి పాట. ఆల్పైన్ అడవుల్లో సరస్సుల మధ్య ప్రకృతి జీవనానికి అలవాటు పడిన వీరి గురించి హాల్‌స్టాట్ అనే ఊరు పూర్తిగా కళ్లకు కడుతుంది. పర్వతాల వాలులో జారి సరస్సులో పడుతున్నట్టు కనిపించే ఊరి దృశ్యాన్ని చూసేందుకు ప్రపంచం కెమెరాల్ని వేసుకుని సరస్సులో స్కూబా డైవ్ చేస్తుంది. ప్రపంచంలో ఎక్కువగా దృశ్యీకరించిన ప్రాంతాల్లో ఇదొకటి. అలాగే ఆస్ట్రియాలోనే అత్యంత పురాతన గ్రామంగాను పిలవబడుతోంది. అప్పట్లో వీరికి సిరిసంపదలు తెచ్చింది 'తెల్ల బంగారం'గా పిలిచే ఉప్పే. ఉప్పు తీసేందుకు గనులున్న అరుదైన ప్రాంతం కూడా ఇదే. భూమి కింద పదుల మీటర్ల లోతు నుంచి తొలుచుకుంటూ వందల మీటర్ల భాగం వరకు ఉప్పును వెలికి తీసిన ఆనవాళ్లు చూడొచ్చు. 7 వేల ఏళ్లనాటి పురావస్తువులు ఇక్కడ లభ్యమయ్యాయి. అద్దాన్ని కొండల మధ్య పరిచినట్టుండే సరస్సు ఉప్పు నీటిదే గానీ 25 మీటర్ల అడుగు వరకు పారదర్శకంగా ఉంటుంది. అందుకే ఎక్కువగా స్కూబా డైవ్ చేస్తుంటారు. ఒక్కో చోట 250 మీటర్ల లోతు వరకు ఉండే ఈ సరస్సు పచ్చటి పర్వతాల్ని చుట్టుకుని ఉంటుంది. చలికాలంలో గడ్డకట్టినపుడు చూస్తే ఓ అనుభూతి... వసంతంలో తెలిమంచు తెరల్లో వీక్షిస్తే మరో అనుభూతిని కలిగించే ఈ గ్రామం కట్టడాలు కూడా వారసత్వ సంపదే. యునెస్కో వారసత్వ గ్రామాల్లో ఇదొకటి.

సెల్ట్‌ల పురాతన గ్రామం